తిరుపతి - చిత్తూరు
తెలుగు జాతీయ దినపత్రిక
వార్త
30 ఏళ్ల ప్రస్థానం వార్త వార్షికోత్సవం 1996 - 2026

# వైఎస్సార్సీ ఇన్‌చార్జ్‌లకు అగ్ని పరీక్షే !

కుప్పం, ఆగస్టు 26 ప్రభాతవార్త : వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ నియోజకవర్గాల ఇన్‌చార్జ్‌లకు వైకాపా అధినేత, మాజీ సిఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి అగ్నిపరీక్ష పెట్టినట్లే. త్వరలో జరగనున్న స్థానిక ఎన్నికలకు సంబంధించి అన్నిచోట్ల వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ అభ్యర్థులను బరిలో నిలపడంతో పాటు అధికార తెలుగుదేశం పార్టీకి ఏకగ్రీవ ఎన్నిక ఎక్కడా జరగకుండా చూడాలని స్పష్టంగా ఆదేశించారు. ఎక్కడైనా ఏకగ్రీవాలు జరిగితే ఆ అసెంబ్లీ నియోజకవర్గాల్లో ఇన్‌చార్జ్‌లకు ఎమ్మెల్యే టికెట్ ఇవ్వనని జగన్ ఖరాఖండిగా చెప్పడం ఇప్పుడు హాట్ టాఫిక్‌గా మారింది. స్థానిక పోరుకు వైఎస్సార్సీ శ్రేణులను సన్నద్ధం చేయాల్సిన బాధ్యత ఆయా నియోజకవర్గాల ఇన్‌చార్జ్‌లకు అప్పగించారు. ఈ నిర్ణయం ఇపు ్పడు వైఎస్సార్సీ ఇన్‌చార్జ్‌లకు కత్తిమీదసాములా మారింది. అధికార తెదేపాను క్షేత్రస్థాయిలో ఢీకొనేందుకు సన్నద్ధం కావాల్సి ఉంది. ప్రస్తుతం చిత్తూరు జిల్లాలో రాజకీయాలు స్థానిక ఎన్నికల నేపథ్యంలో ఊపందుకుంటున్నాయి.

చిత్తూరు జిల్లాలో స్థానిక సంస్థల ఎన్నికల్లో అధికార తెలుగుదేశం, ప్రతిపక్ష వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ మధ్య యుద్ధం తప్పేలా లేదు. ప్రధానంగా చిత్తూరు జిల్లాలో ప్రస్తుతం ఆరు నియోజకవర్గాలు ఉన్నాయి. కుప్పం, చిత్తూరు, పలమనేరు, నగరి, పూతలపట్టు, జిడి నెల్లూరు నియోజకవర్గాల్లో ప్రస్తుతం అధికార పార్టీకి చెందిన ఎమ్మెల్యేలే ఉన్నారు. కుప్పం నుంచి సిఎం చంద్రబాబు నాయుడు, పలమనేరు నుంచి మాజీ మంత్రి అమరనాథ్‌రెడ్డి ప్రాతినిధ్యం వహిస్తున్నారు. మిగతా నియోజకవర్గాల్లో తొలిసారి ఎమ్మెల్యేలుగా గెలిచిన గురజాల జగన్మోహన్, గాలి భానుప్రకాష్, డాక్టర్ థామస్, డాక్టర్ మురళీ మోహన్ ఉన్నారు. వీరికి కూడా ఆయా నియోజక వర్గాల్లో స్థానిక ఎన్నికలు ఎంతో కీలకం. ఇక వైఎస్సార్ కాంగ్రెస్ తరపున ఇన్‌చార్జ్‌లుగా ఆయా నియోజకవర్గాల్లో ఎమ్మెల్సీ భరత్, మాజీ ఎమ్మెల్యే వెంకటేగౌడ, విజయానందరెడ్డి, మాజీ మంత్రులు రోజా, నారాయణ సా ్వమి, సునీల్‌కుమార్ ఉన్నారు. ఈ నేపథ్యంలో చితూ_రు జిల్లాలో జరిగే స్థానిక ఎన్నికల పోరు హోరాహోరీగా కొనసాగే అవకాశాలు కన్పిస్తున్నాయి. వైకాపా తరపున మాజీ ఎమ్మెల్యేలు స్థానిక పోరుకు బాధ్యతలు వహించనుండగా తెదేపాలో అధికార ఎమ్మెల్యేలు బాధ్యతలు తీసుకున్నారు. చిత్తూరు జిల్లాలో వైఎస్సార్సీ శ్రేణులను పార్టీ ఇన్‌చార్జ్‌లు ఏ విధంగా ఎన్నికలకు సన్నద్ధం చేస్తారనేది ఇప్పుడు చర్చకు దారితీసో_ంది. కొన్ని నియోజకవర్గాల్లో ఇన్‌చార్జ్‌లు యాక్టివ్‌గా ఉన్నా కొన్ని నియోజకవర్గాల్లో పార్టీ అధినేత జగన్ ఆదేశాలతో ఇప్పుడు యాక్టివ్ కావాల్సి ఉంది. ఎన్నికలకు సమయం దగ్గరపడుతున్న తరుణంలో వైఎస్సార్సీ ఇన్‌చార్జ్‌లకు పార్టీ అధినేత జగన్ ఇచ్చిన ఆదేశాలు ఇపు ్పడు జీవన్మరణ సమస్యగా మారిందనడంలో సందేహం లేదు.

# ఉపాధ్యాయుల ఆందోళనను...
# పట్టించుకోని ప్రభుత్వం



పెనగలూరు, ఆగస్టు 26 ప్రభాతవార్త: పెనగలూరు మండలం గత కొన్ని నెలలుగా ఉపాధ్యాయ సంఘాలు, ఉపాధ్యాయులు అనేక సార్లు విద్యాశాఖ మంత్రి లోకేష్‌కు, అధికారులకు టెట్ విషయంలో ఉపాధ్యాయుల సమస్యలను ప్రాతినిధ్యం చేసినప్పటికీ ఏమాత్రం పట్టించుకోలేదని యుటిఎఫ్ రాష్ట్రకార్యవర్గ సభ్యులు బి.హరి ప్రసాద్, పెనగలూరు మండల అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు పి. శ్రీనివాసకుమార్, యం.నరసింహారావు అసహనం వ్యక్తం చేశారు. మంగళవారం ఉపాధ్యాయులు ప్రభుత్వం విడుదల చేసిన స్పెషల్ టెట్ నోటిఫికేషన్ కాపీలను చించివేసి నిరసన వ్యక్తం చేశారు. వారు మాట్లాడుతూ ప్రభుత్వం ఇన్ సర్వీస్ ఉపాధ్యాయుల కోసం అని విడుదల చేసిన స్పెషల్ నోటిఫికేషన్‌కు జనరల్ నోటిఫికేషన్‌కు ఏమి తేడా లేదని అన్నారు. స్పెషల్ టెట్ నోటిఫికేషన్‌లో కూడా నిబంధనలు సాధారణ నోటిఫికేషన్ లాగానే వున్నాయని పేర్కొన్నారు. ప్రభుత్వం ఇప్పటికైనా స్పందించకపోతే రాష్ట్ర వ్యాప్తంగా బైక్ జాతార నిర్వహించనున్నట్లు, సెప్టెంబర్ 3న చలో విజయవాడ కార్యక్రమం, సెప్టెంబర్ 4 నుండి నిరవధిక నిరాహార దీక్షలు చేపట్టనున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో యుటిఎఫ్ నాయకులు,ప్రధానోపాధ్యాయులు,ఉపాధ్యాయులు గోపాల కృష్ణ, అన్వర్ బాష, మహేంద్ర, సురేంద్ర, హసనయ్య, శివ నరసింహులు, కృష్ణ కుమారి, ప్రమీల, పరిమళ తదితరులు పాల్గొన్నారు.

# జడ్పీ ఛైర్మన్ కుర్చీ ఎవరికి!

- ఎస్సీ మహిళలకు జడ్పీ ఛైర్మన్ పదవి రిజర్వ్ అయ్యే అవకాశం
- కొత్తగా జడ్పీలు ఏర్పాటు కావడంతో ఛైర్మన్ కుర్చీ రిజర్వేషన్ తారుమారు



చిత్తూరు, ఆగస్టు 26 ప్రభాతవార్త: ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు సొంత జిల్లా చిత్తూరులో జడ్పీ ఛైర్మన్ కుర్చీ ఏ వర్గానికి రిజర్వ్ అవుతుందనే అంశం ప్రస్తుతం చర్చనీయాంశంగా మారింది. జడ్పీ ఛైర్మన్ కుర్చీల రిజర్వేషన్ల అమలు మేరకు ఈ సారి జడ్పీ ఛైర్మన్ పదవి ఎస్సీ మహిళకు రిజర్వ్ అయ్యే అవకాశాలు కన్పిస్తున్నాయి. అయితే రాష్ట్రంలో కొత్తగా జిల్లాలు ఏర్పాటు చేయడం, ఇది వరకు వున్న ఉమ్మడి చిత్తూరు జిల్లా ప్రస్తుతం కొత్తగా చిత్తూరు జిల్లాతో పాటు తిరుపతి, అన్నమయ్య జిల్లాలుగా విభజన కావడంతో చిత్తూరు జడ్పీ ఛైర్మన్ కుర్చీతో పాటు అన్నమయ్య, తిరుపతి జిల్లాల జడ్పీ ఛైర్మన్ కుర్చీలకు రిజర్వేషన్లు ఖరారు చేయాల్సి వుండటంతో ప్రస్తుత విభజిత చిత్తూరు జిల్లా జడ్పీ ఛైర్మన్ పదవిని సైతం కొత్తగా ఏర్పాటు అయ్యే జడ్పీ ఛైర్మన్ కుర్చీలతో పాటు రిజర్వేషన్లు అమలు చేయాల్సి వస్తే చిత్తూరు జిల్లా జడ్పీ ఛైర్మన్ కుర్చీ పదవి రిజర్వేషన్ తారుమారు అయ్యే అవకాశం కన్పిస్తుంది. అలాగే ఇది వరకు జడ్పీ ఛైర్మన్ పదవులకు ఎన్నికలు పరోక్ష పద్ధతిలో నిర్వహించేవారు. ఏదేని ఒక మండలంలో జడ్పీటిసీగా ఎన్నికైన వ్యక్తిని, జిల్లాలో మెజార్టీ జడ్పీటిసీ స్థానాలు చేజిక్కించుకున్న పార్టీకి చెందిన జడ్పీటిసీలు అందరు కలిసి జడ్పీ ఛైర్మన్‌ను పరోక్ష పద్ధతిలో ఎన్నుకునే వారు. ఈ మేరకు ప్రస్తుతం జడ్పీ ఛైర్మన్‌గా వున్న గోవిందప్ప శ్రీనివాసులు, ఇది వరకు జడ్పీ ఛైర్మన్లుగా వ్యవహరించిన గీర్వాణీ చంద్రప్రకాష్, సుబ్రమణ్యంరెడ్డి, కుమార్‌రాజా, రెడ్డమ్మలు అలా జడ్పీ ఛైర్మన్లుగా ఎన్నికైన వారే. దానికంటే ముందు జడ్పీ ఛైర్మన్ పదవులకు ప్రత్యక్షంగా ఎన్నికలు నిర్వహించే వారు. ఈ విధానంలో జడ్పీ ఛైర్మన్లుగా జిల్లాలోని ప్రజల నుండి తెలుగుదేశం పార్టీ తరపున యు.గోవిందస్వామి, శ్రీనాథరెడ్డిలు ఎన్నికయ్యారు. 2014 జడ్పీటిసీ ఎన్నికల్లో మెజార్టీ జడ్పీటిసీ స్థానాలు తెలుగుదేశం పార్టీ దక్కించుకోవడంతో ఆ పార్టీ అధిష్టానం జడ్పీ ఛైర్‌పర్సన్ అభ్యర్థిగా చిత్తూరు రూరల్ మండలం జడ్పీటిసీగా ఎన్నికైన గీర్వాణీ చంద్రప్రకాష్‌ను ఎంపిక చేయడంతో ఆమె జడ్పీ ఛైర్‌పర్సన్‌గా ఐదేళ్ళపాటు కొనసాగారు. ఆపై 2021లో జరిగిన జడ్పీటిసీ ఎన్నికల్లో వి.కోట నుండి జడ్పీటిసీగా ఎన్నికైన గోవిందప్ప శ్రీనివాసులు జడ్పీ ఛైర్మన్‌గా ఎన్నికయ్యారు. ఈ ఎన్నికల్లో వైకాపా మెజార్టీ జడ్పీటిసీ స్థానాలు దక్కించుకోవడంతో జడ్పీ ఛైర్మన్‌గా బిసీ జనరల్ వర్గానికి చెందిన గోవిందప్ప శ్రీనివాసులు జడ్పీ ఛైర్మన్ కుర్చీని కైవసం చేసుకున్నారు. మళ్ళీ ప్రస్తుతం జడ్పీ ఛైర్మన్ పదవికి ప్రత్యక్ష ఎన్నికలు నిర్వహించాలని ప్రభుత్వం నిర్ణయించడంతో ఈ మేరకు జడ్పీ ఛైర్మన్ కుర్చీ రిజర్వేషన్ ఏ వర్గానికి రిజర్వ్ అవుతుంది! ఏ వర్గం నుండి ఏ పార్టీ తరపున ఎవరు జడ్పీ ఛైర్మన్‌గా ఎన్నికల బరిలో నిలవనున్నారు! అసలు జడ్పీ ఛైర్మన్ పదవికి ప్రత్యక్ష ఎన్నికలు నిర్వహిస్తారా! లేక ఇది వరకు అమలులో వున్న విధానంలో ఎన్నికలు జరుగుతాయా! అనే అంశంపై సర్వత్రా చర్చ జరుగుతోంది.

# నాలుగు అంతస్తుల భవనం నేలమట్టం

-గోతుల తవ్వకాలే భవన నిర్మాణం కూలడానికి కారణమా?-తృటిలో తప్పిన ప్రాణ నష్టం...భవన నిర్మాణ అనుమతులపై అనుమానాలు



తిరుపతి వాణీనగర్‌లో కూలిన నాలుగు అంతస్థుల భవనం

తిరుపతిరూరల్, ఆగస్టు26 ప్రభాతవార్త: తిరుపతిరూరల్ మండలంలో నాలుగు అంతస్తుల భవనం కూలిన ఘటన సంచలనం రేపింది. భవనం నేలమట్టమైన సమయంలో ఎలాంటి ప్రాణనష్టం జరగకపోవడంతో అధికార యంత్రాంగం ఊపిరి పీల్చుకుంది. తిరుపతిరూరల్ మండలం అవిలాల గ్రామ పంచాయతీ పరిధిలోని వాణినగర్ ఎక్స్‌టెన్షన్‌లో నాలుగు అంతస్తుల భవనం కూలిన ఘటనపై అనుమతుల అంశం కీలకంగా మారింది. పక్క స్థలంలో నిర్మాణ పనుల కోసం భారీగా గోతులు తీయడంతో భవనం కుప్పకూలినట్లు ప్రాథమికంగా తేలింది. ఈ ఘటనలో ప్రాణనష్టం జరగకపోవడం ఉపశమనం కలిగించింది. అవిలాల గ్రామ పంచాయతీ కార్యదర్శి సుబ్బరాయుడు తెలిపిన వివరాలు మేరకు కూలిన భవనానికి సంబంధించి అనుమతులు ఉన్నాయా లేదా అన్నది ప్రస్తుతం రికార్డులు పరిశీలిస్తున్నట్లు వెల్లడించారు. అదే సమయంలో పక్కన నిర్మాణం చేపడుతున్న స్థల యజమాని నాగేశ్వరరావుకు మాత్రం ఇప్పటివరకు ఎలాంటి అనుమతులు ఇవ్వలేదని స్పష్టం చేశారు. ఈ ప్రాంతం బఫర్‌జోన్ పరిధిలో ఉండటంతో నిర్మాణాలకు ప్రత్యేక అనుమతులు తప్పనిసరిగా తీసుకోవాలని ముందుగానే నాగేశ్వరావుకు తెలియజేసినట్లు పేర్కొన్నారు. అయినప్పటికీ ఆయన అనుమతులు పొందకుండా తవ్వకాలు ప్రారంభించడంతో ఈ ప్రమాదం సంభవించినట్లు స్థానికులు ఆరోపించారు. కూలిన నాలుగు అంతస్తుల భవనం బైరాగిపట్టెడకు చెందిన బాబు అనే వ్యక్తిదిగా సమాచారం. భవనం పటిష్టతపై కూడా సందేహాలు వ్యక్తమవుతున్నాయి. అలాగే కూలిన భవనంపై బిఎస్ఎన్ఎల్ సెల్ టవర్ ఉన్నట్లు వెల్లడించారు. ఘటన సమాచారం అందుకున్న వెంటనే తిరుపతిరూరల్ పోలీసులు, అగ్నిమాపక సిబ్బంది సంఘటన స్థలానికి చేరుకుని పరిస్థితిని అదుపులోకి తీసుకున్నారు. పరిసర ప్రాంతాన్ని ఖాళీ చేయించి, భద్రతా చర్యలు చేపట్టారు. అనుమతులు లేకుండా భవన నిర్మాణ పనులు ప్రారంభించిన నాగేశ్వరరావుపై కేసు నమోదు చేసినట్లు సమాచారం. ఈ ఘటనపై సమగ్ర దర్యాప్తు కొనసాగుతుందని సి.ఐ. మద్దయ్య ఆచారి వెల్లడించారు. ఈ ఘటనతో నిర్మాణాలపై నియంత్రణలు కట్టుదిట్టం చేయాల్సిన అవసరం ఉందన్న చర్చ మండలం మొదలైంది.

# చెరువులో మట్టి మాఫియా... బరితెగింపు

-రాజకీయ అండతో యథేచ్ఛగా అక్రమ తవ్వకాలు

శ్రీకాళహస్తి రూరల్, ఆగస్టు 26 ప్రభాతవార్త: సాగు, తాగునీటికి జీవనాధారమైన కమ్మకత్తూరు గ్రామ చెరువు మట్టి మాఫియా చేతిలో అడ్డగోలుగా దోపిడీకి గురవుతోంది. రాజకీయ నాయకుల అండదండలతో కొందరు స్థానిక నేతలు చెరువులోని విలువైన బంకమట్టిని ఇష్టారాజ్యంగా తవ్వి ఇటుక బట్టీల వ్యాపారులకు అమ్ముకుంటూ లక్షల్లో సొమ్ము చేసుకుంటున్నారు. అధికార యంత్రాంగం చూసీ చూడనట్లు వ్యవహరిస్తుండటంతో ఈ దందా రోజురోజుకూ శృతి మించుతోంది. విశ్వసనీయ సమాచారం ప్రకారం కమ్మకత్తూరు గ్రామ చెరువులోని సారవంతమైన బంకమట్టికి ఇటుక బట్టీలలో భారీ డిమాండ్ ఉంది. దీనిని ఆసరాగా చేసుకుని స్థానికంగా ఉండే కొందరు అధికార పార్టీ అనుబంధ నేతలు ఇటుక బట్టీల యజమానులతో కుమ్మక్కై ఒక్కో ట్రక్కు మట్టిని రూ. 2000 చొప్పున బేరం కుదుర్చుకున్నట్లు తెలుస్తోంది. రోజుకు 30 నుంచి 40 ట్రక్కులు, ట్రాక్టర్లతో మట్టిని తరలిస్తూ రోజుకు లక్ష రూపాయల వరకు అక్రమ వసూళ్లకు పాల్పడుతున్నారని గ్రామస్తులు ఆరోపిస్తున్నారు. అక్రమ రవాణాకు అడ్డుగా ఉన్న చెరువు కట్టను సైతం జేసీబీలతో తవ్వి వాహనాలు వెళ్లేందుకు ప్రత్యేకంగా మట్టి రోడ్డును ఏర్పాటు చేసుకోవడం వారి బరితెగింపునకు నిదర్శనం. దీంతో వర్షాకాలంలో నీరు నిలవాల్సిన చెరువు పూర్తిగా గుంతల మయంగా మారి ధ్వంసమవుతోంది. బంకమట్టిని తొలగించడం వల్ల చెరువులో నీరు నిలిచే సామర్థ్యం పూర్తిగా దెబ్బతింటుందని, భవిష్యత్తులో భూగర్భ జలాలు అడుగంటి పంటలు ఎండిపోయే ప్రమాదం ఉందని రైతులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. ఇది మా చెరువు, మా పంటలకు జీవం. తాతల కాలం నుంచి ఈ చెరువు నీటితోనే సాగు చేస్తున్నాం. బంకమట్టి తీసేస్తే చెరువులో నీరు నిలవదు, ఇంకిపోతుంది. నాయకులు, బట్టీల వాళ్ళు లాభాలు దండుకుంటున్నారు, తీవ్రంగా నష్టపోయేది మాత్రం మేమే అంటూ రైతులు వాపోతున్నారు. రాజకీయ అండ ఉండటంతో అధికారులకు ఫిర్యాదు చేసినా పట్టించుకోవడం లేదని వారు వాపోతున్నారు.జిల్లా ఉన్నతాధికారులు, రెవెన్యూ, మైనింగ్, ఇరిగేషన్ శాఖల అధికారులు తక్షణమే స్పందించి కమ్మకత్తూరు చెరువును సందర్శించి ఈ అక్రమ మట్టి దందాకు అడ్డుకట్ట వేయాలని, చెరువును కాపాడి దోషులపై కఠిన చర్యలు తీసుకోవాలని గ్రామ ప్రజలు, రైతులు డిమాండ్ చేస్తున్నారు.



కట్టపై దారి తవ్వి బంక మట్టిని ట్రాక్టర్ల ద్వారా తరలిస్తున్న దృశ్యం

# భక్తుల రద్దీ వేళ...లడ్డూలకు తప్పని పడిగాపులు

-కౌంటర్ల నిర్వహణ అస్తవ్యస్థం-సిబ్బంది లేక మొదటి అంతస్థులో లడ్డూకౌంటర్ల మూత

తిరుమల,ఆగస్టు 26ప్రభాతవార్తప్రతినిధి: తిరుమలలో భక్తుల రద్దీ అనూహ్యంగా పెరిగిన సమయంలో లడ్డూకౌంటర్ల నిర్వహణ అస్తవ్యస్థంగా తయారైందని భక్తులు విమర్శిస్తున్నారు. భక్తుల రద్దీకి తగ్గట్లు లడ్డూకౌంటర్లను టిటిడి నిర్వహించాల్సి ఉన్నా సిబ్బంది కొరతతో కౌంటర్లు పనిచేయడంలేదని అక్కడి సిబ్బంది చెప్పడం భక్తులను విస్మయానికి గురిచేసింది. బుధవారం రాత్రి తిరుమల లడ్డూవితరణ శాలలోని మొదటి అంతస్థులో కౌంటర్లు మూతబడటంతో భక్తులు క్రిందనే ఉన్న లడ్డూకౌంటర్ల వద్ద పెద్ద సంఖ్యలో బారులు తీరి నాలుగు లడ్డూలకు గంటల తరబడి నిరీక్షణ చేయాల్సి వచ్చింది.తిరుమలలో భక్తులకు శ్రీవారి దర్శనం తరువాత లడ్డూప్రసాదాల విక్రయాలు వేగంగా అందించాలని టిటిడి అదికారుల ఆలోచన. కౌంటర్ల వద్ద త్వరితగతిన లడ్డూలు అందించేలా చర్యలు తీసుకోవాలని పదేపదే ఛైర్మన్ బిఆర్‌నాయుడు, అదనపు ఇఒ చిరుమామిళ్ళ వెంకయ్యచౌదరి చేస్తున్న సూచనలు లడ్డూకౌంటర్ల పర్యవేక్షకులు అమలుచేయడంలేదు. దీంతో భక్తుల రద్దీ పెరిగితే కౌంటర్ల వద్ద బారులు తప్పడంలేదు. భక్తుల సౌకర్యార్థం తిరుమలలో 46 లడ్డూ కౌంటర్లు నిర్వహిస్తు న్నారు. ఇందులో ఐదు వరకు కౌంటర్లు పనిచేయవు. మిగిలిన 41కౌంటర్లు 24 గంటలూ భక్తులకు అందుబాటులో ఉండాలి. అయితే బుధవారం సాయంత్రం ఉన్నఫళంగా లడ్డూ వితరణశాలలోని కౌంటర్లలో మొదటి అంతస్థులోని కౌంటర్లు పూర్తిగా మూసివేశారు. దీంతో భక్తులు క్రింద ఫ్లోర్‌లోనే ఉన్న కౌంటర్ల వద్ద బారులుతీరి నిలబడ్డారు. రోజుకు సరాసరి 4లక్షల వరకు లడ్డూలు విక్రయాలు జరుగుతున్నాయంటే భక్తుల నుండి డిమాండ్ ఏ మేరకు ఉందనేది తెలుస్తుంది. గతంకంటే గత రెండేళ్ళుగాతిరుమల లడ్డూల నాణ్యత, రుచి సంతృప్తిగా ఉంది. దీంతో భక్తులు కూడా అదనపు లడ్డూలు కొనుగోలుచేస్తున్నారు. క్యూలైన్లలో వేచి ఉండే సమయం తగ్గించాలని పదేపదే చెబుతున్నా సిబ్బంది మాత్రం ఆచరణలో అమలుచేయడంలేదు. తిరుమలలో భక్తుల రద్దీ పెరిగిన నేపథ్యంలో దర్శనాలకు సమయం పట్టినా లడ్డూలకు కూడా నిరీక్షణ తప్పడంలేదనేది భక్తుల్లో ఆవేదన. ప్రస్తుతం రోజుకు 4 లక్షల వరకు లడ్డూలు విక్రయాలు జరుగుతుండటం విశేషం. క్యూలైన్లలో బారులు తీరి నిలబడ కూడదని కియోస్క్ యంత్రాలు అందుటులోకి తీసుకువచ్చినా కౌంటర్ల వద్ద నిరీక్షణ తప్పడంలేదు. భక్తుల రద్దీ పెరిగిన సమయంలో ఆలయ అధికారులు, పోటు విభాగం పర్యవేక్షకులు పర్యవేక్షణ చేసి భక్తులకు ఇబ్బంది లేకుండా చూడాలని కోరుతున్నారు.

# బెంబేలెత్తిపోయిన....ద్విచక్ర వాహనదారులు

- హెల్మెట్ ధారణపై ఆకస్మిక తనిఖీలకు కారణమేమి! - ఆదాయమే పరమావదా? - ముందస్తు అవగాహన కార్యక్రమాలు ఏవి? - గడువు తారీకు ఇస్తారు కదా, ఒక్క రోజుకి 450 మందిపై కేసులా..!- రూ. 4.5 లక్షలు జరిమానా



హెల్మెట్ లేని వాహనదారులకు చలానాలు రాస్తున్న పోలీసులు

తిరుపతి క్రైం, ఆగస్టు 26 ప్రభాతవార్త: గరుడ వారధి పై ఆకస్మిక హెల్మెట్ తనిఖీలకు కారణము ఏమై ఉంటాదని కేవలం ఆదాయమే పరమావధిగా, జరిమానాలే లక్ష్యంగా హెల్మెట్ తనిఖీలు సాగిందని తిరుపతిలోని ద్విచక్ర వాహనదారులు బెంబేలెత్తిపోయారు. మంగళవారం గరుడ వారధి పై ద్విచక్ర వాహనదారులను ఆర్‌టిఎ అధికారులు తనిఖీలు చేపట్టారు. ప్రధానంగా హెల్మెట్లను లక్ష్యంగా చేసుకుని ఈ తనికీలు చేపట్టారు. ఒక్కసారిగా వందలాది ద్విచక్ర వాహనా దారులను నిలిపేసి గతంలో ఎప్పుడూ లేనివిధంగా 450 వాహనదారులపై కేసులు మోపి నాలుగున్నర లక్షల రూపాయలు జరిమానా వసూలు చేశారు. గతంలో హెల్మెట్ ధారణపై ముందస్తు అవగాహన ర్యాలీలు నిర్వహిస్తూ గడువు తారిఖులను ప్రకటించడం ఆనవాయితీగా సాగుతున్నది. అయితే ఎటువంటి హెచ్చరికలు లేకుండా ఆకస్మికంగా వందలాది మందికి జరిమానా విధించడంపై వాహనదారులు ఆదాయమే పరమావదా అన్నట్లుగా ఈ తనిఖీలు సాగుతున్నట్లు తిరుపతి ప్రజలు వాపోతున్నారు. హెల్మెట్ ధరించడం వారి వారి ప్రాణాలకు ఎంతో ఉపయోగకరము అయినప్పటికీ తిరుపతి పట్టణ వాహనదారులకు అవగాహన లేకపోవడంతో కనీస సూచనలైన లేక ప్రకటన ద్వారా అయినా సమాచారం ఇచ్చి ఉంటే బాగుండేదని పలువురు అభిప్రాయపడుతున్నారు. ఇకనైనా ఆర్‌టిఎ అధికారులు జరిమానాలే లక్ష్యం కాకుండా వాహనదారుల ప్రయోజనాలతో పాటు వారికి సరైన అవగాహన కార్యక్రమాలు చేపట్టవలసిన అవసరం ఎంతైనా ఉంది.

# శ్రీకాళహస్తి మున్సిపాలిటీకి
# నిధులు వరద

- హెచ్‌ఏఎంలో రూ.27కోట్లు
- మరో రూ. 32కోట్లకు ప్రతిపాదనలు

శ్రీకాళహస్తి, ఆగస్టు 26 ప్రభాతవార్త: శ్రీకాళహస్తి మున్సిపాలిటీకి వివిధ పథకాలలో నిధుల వరద రానుంది. ఇప్పటికే హెచ్ఏఎం ఆధ్వర్యంలో రూ. 27కోట్లు ప్రతిపాదనలు పంపగా, ఎస్‌సి కార్యాలయం అనుమతించి ఇఎన్‌సికి పంపినట్లు సమాచారం. నేడో రేపో ఇఎన్‌సి కార్యాలయం నుంచి టెక్నికల్ సాంక్షన్ అనుమతి లభించే అవకాశం వుంది. శ్రీకాళహస్తి శాసనసభ్యుడుగా బొజ్జల సుధీర్‌రెడ్డి బాధ్యతలు చేపట్టిన తరువాత ప్రత్యేక నిధుల కోసం పరుగులు తీస్తున్నారు. ఈ నేపథ్యంలో హెచ్‌ఏఎం పథకంలో రూ. 27కోట్లు రానుంది.



**రెండు పార్కులు, 69 రోడ్లు:**

శ్రీకాళహస్తి మున్సిపాలిటీకి హెచ్‌ఏఎంలో మంజూరు అయిన రుణాలకు సంబంధించి కమిషనర్ కెవి క్రిష్ణారెడ్డి, డిఇ రవి ప్రకాష్‌లు, శాసనసభ్యులు సుధీర్‌రెడ్డి సూచనల మేరకు అంచనా ప్రతిపాదనలు రూపొందించి పంపామన్నారు. ఇందులో తాము 98 పనులకు సంబంధించి అంచనా ప్రతిపాదనలు పంపామని దాదాపుగా అన్ని పనులకు సంబంధించి అనుమతి లభించవచ్చునని ఆశాభావం వ్యక్తం చేశారు. ఇందులో పట్టణ ప్రజలకు ఆహ్లాదాన్ని అందించేందుకు రెండు పార్కులు, ఏపి టూరిజం నుంచి పానగల్ వరకు రెండు డివైడర్లు ఏర్పాటు చేస్తున్నట్లు తెలిపారు. డివైడర్ల మధ్య నేటి సాంకేతిక పరిజ్ఞానంకు తగినట్లు లైటింగ్ ఏర్పాటు చేస్తున్నట్లు అధికారులు వివరించారు. కాగా పట్టణంలోని 35 వార్డులలతో 69 రోడ్లను ప్రతిపాదించినట్లు తెలిపారు. శ్రీకాళహస్తి మున్సిపాలిటీలో సుమారు 10ఏళ్ళ క్రితం వీధి దీపాలు ఏర్పాటు చేశారని, అవి నేటి అవసరాలను తీర్చలేకున్నాయని, కొత్త లైట్లను రూపొందించినట్లు వివరించారు. ఈ పనులన్నీ హెచ్ఏఎం రుణంతో చేపట్టనున్నట్లు వివరించారు. రాష్ట్రంలోని 123 మున్సిపాలిటీలు ఈ పథకంలో నిధులు మంజూరు అవుతున్నాయని అందులో శ్రీకాళహస్తి కూడా వుందని తెలిపారు. పుణ్యక్షేత్రమైన శ్రీకాళహస్తి మున్సిపాలిటీని సర్వాంగసుందరంగా తీర్చిదిద్దుటకు ఎంఎల్ఏ సూచించిన పలు కీలకమైన పనులను చేపట్టుటకు రూ. 32కోట్లతో అంచనా ప్రతిపాదనలు పంపినట్లు వివరించారు. ఇందులో శ్రీకాళహస్తి మున్సిపాలిటీలో జఠిలంగా వున్న డ్రైనేజి వ్యవస్థ స్థానంలో భూగర్భ డ్రైనేజ్ ఏర్పాటుకు అంచనా ప్రతిపాదనలు రూపొందించారని కమిషనర్ కెవి క్రిష్ణారెడ్డి, డిఇ రవి ప్రకాష్ వివరించారు. ఈ నిధులతో శ్రీకాళహస్తి పట్టణ రూపురేఖలు మారిపోగలవని అభిప్రాయపడ్డారు. పనులన్నీ రాష్ట్ర స్థాయిలో ప్రైవేట్ ఏజెన్సీలకు అప్పగించనున్నట్లు ఓ ప్రశ్నకు సమాధానంగా తెలిపారు.

# కోటపోలూరులో దారుణ హత్య...
# భార్యను హతమార్చిన భర్త!

సూళ్లూరుపేట, ఆగస్టు 26 ప్రభాతవార్త: దుర్వ్యసనాలకు బానిసైన భర్త గంజాయి మత్తులో కట్టుకున్న భార్యని కడతేర్చిన ఘటన సూళ్లూరుపేట మండల పరిధిలోని కోటపోలూరు గ్రామంలో బుధవారం చోటుచేసుకుంది. కోట పోలూరులోని పడమటి హరిజనవాడకు చెందిన పనబాక శ్రీనివాసులు తన భార్య పనబాక సంధ్య (34)ను హత్య చేసిన ఘటన మండలంలో సంచలం రేకెత్తించింది. సినీ ఫక్కిలో తన భార్యను హత్య చేసి, ఆ శవాన్ని తన మోటార్ బైకు వెనుక ఎక్కించుకొని తాపీగా తన ఇంటి వద్దకే తీసుకువెళ్లి పడవేసిన సంఘటన ఈ ఘటనను చూసిన వారిని ఆశ్చర్యాన్ని గురిచేసింది. పనబాక శ్రీనివాసులకు తడ మండలం కారి జాత గ్రామానికి చెందిన సంధ్యతో 13 ఏళ్ల క్రితం వివాహం జరిగింది. వివాహనంతరం వీరికి ఇద్దరు పిల్లలు జన్మించారు. బాగా వివాహమైన ప్పటి నుంచి శ్రీనివాసులు దుర్వ్యసనాలకు బానిసై తరచు భార్యను ఉపయోగించడం మొదలు పెట్టాడు. భర్త వేధింపులు కుటుంబ కలహాలతో విసిగిపోయిన సంధ్య చివరకు భర్తకు దూరంగా తన స్వగ్రామమైన కారిజాతలోని తల్లిదండ్రులకు దగ్గరకు వెళ్ళింది. ప్రైవేట్ కంపెనీలో చిన్నపాటి ఉద్యోగాన్ని చేసుకుంటూ పిల్లల్ని చదివించుకుని జీవనం సాగిస్తున్నది. ఈ నేపథ్యంలో మంగళవారం సంధ్య తన కుమారుని వెంటబెట్టుకుని కోటపోలూరు వెళ్ళింది. అక్కడ స్కూల్లో కుమారుని చేర్చింది. ఇదంతా గమనిస్తూ ఉన్న శ్రీనివాసులు భార్య సంధ్య వద్దకు చేరుకొని ఆమెకు మాయ మాటలు చెప్పి నమ్మించి తన వెంట తీసుకుని వెళ్ళాడు. ఊరు బయట ఉన్న పొలాల్లో ఆమెను తీవ్రంగా హింసించి హత్య చేశాడు. వేకువ జామున ఇదేమి పట్టనట్లు చనిపోయిన భార్యను, మోటార్ బైక్ వెనుక భాగంలో ఎక్కించుకొని తన ఇంటికి చేరుకున్నాడు. అక్కడ మృతదేహాన్ని పడవేయడంతో, దీనిని చూసిన ఆ ప్రాంత వాసులు ఒక్కసారిగా భయంతో హడలిపోయారు. ఈ సమాచారం అందుకున్న స్థానిక సీఐ ఎం మురళీకృష్ణ సంఘటన స్థలానికి చేరుకొని కేసు నమోదు చేసి దర్యాప్తు ప్రారంభించారు.

27 CTR 2:27 CTR 2.qxd 8/26/2026 10:35 PM Page 1



## చిన్నారుల ఆరోగ్యంపై సిఎం ఆరా

**- పిల్లలకు నాణ్యమైన వైద్యం అందేలా ఆదేశాలు !!**



**కుప్పం, ఆగస్టు 26 ప్రభాతవార్త:**

మండలంలోని కంగుంది ఎస్టీ కాలనీకి చెందిన ఆరుమంది చిన్నారుల ఆరోగ్య పరిస్థితిపై సిఎం చంద్రబాబునాయుడు ఆరా తీశారు. ఎస్టీకాలనీకి చెందిన ఆరుమంది పిల్లలు మంగళవారం సాయంత్రం ఎర్ర ఆముదం కాయలు తిని అస్వస్థతకు గురికాగా పిల్లలను చికిత్స నిమిత్తం కుప్పం ఏరియా ఆస్పత్రిలో చేర్చిన విషయం విదితమే. కడ పి.డి. వికాస్ మర్మత్ మంగళవారం రాత్రి కుప్పం ఏరియా ఆస్పత్రికి చేరుకుని పిల్లలకు అందిస్తున్న చికిత్సపై వైద్యులతో మాట్లాడారు. కాగా ఈ విషయంగా సిఎం కడ ప్రాజెక్ట్ డైరెక్టర్ వికాస్ మర్మత్‌కు ఫోన్ చేసి పిల్లల ఆరోగ్యం గురించి అడిగి తెలుసుకున్నారు. ఐదు మంది పిల్లల ఆరోగ్య పరిస్థితి సాధారణ దశకు వచ్చిందని లేఖ్య అనే బాలికకు కొంత అస వ్యస్థత తగ్గకపోవడంతో హుటాహుటిన కుప్పం పిఇఎస్‌కు తరలించినట్లు కడ పి.డి. వికాస్ మర్మత్ సిఎంకు వివరించారు. పిల్లలు మరింత ఆరోగ్యంగా కోలుకునేలా వైద్యులు నాణ్యమైన వైద్యం అందేలా వైద్యులను సిఎం ఆదేశించారు.

## గ్రామాల అభివృద్ధి సిఎంకే సాధ్యం

**- రెస్కో ఛైర్మన్ ప్రతాప్‌కుమార్**

**కుప్పం, ఆగస్టు 26 ప్రభాతవార్త:**



గ్రామాల అభివృద్ధి సిఎం చంద్రబాబునాయుడు తోనే సాధ్యమవుతుందని రెస్కోఛైర్మన్ ప్రతాప్‌కుమార్ పేర్కొన్నారు. బుధవారం సిఎం చంద్రబాబు ఆదేశాలతో మున్సిపల్ పరిధి కమతమూరు గ్రామం నుంచి గుల్లేపల్లి వరకు డ్రైనేజ్ కాలువల నిర్మాణంకు ఆయన భూమిపూజ చేసి పనులు ప్రారంభించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ గ్రామస్తుల సౌకర్యార్థం పారిశుద్ధ్యం, అభివృద్ధిని దృష్టిలో ఉంచుకుని నూతనంగా డ్రైన్ల నిర్మాణంకు చర్యలు చేపట్టామన్నారు. గ్రామాల్లో మౌలిక సదుపాయాల కల్పనకు ప్రభుత్వం పెద్దపీట వేస్తోందన్నారు. కార్యక్రమంలో కడ సభ్యుడు రాజ్‌కుమార్, మున్సిపల్ టిడిపి అధ్యక్షుడు కాణిపాకం వెంకటేష్, రెస్కో డైరెక్టర్ ఆర్ముగం, కార్పోరేషన్ డైరెక్టర్ వినోద్, నేతలు రవి, మునెప్ప, శివ, రవి,నాగేంద్ర తదితరులు పాల్గొన్నారు.

## పదో క్లస్టర్‌లో ఇంటింటికీ తెదేపా వందశాతం

**- కార్పోరేషన్ డైరెక్టర్ వేణుగోపాల్**

**కుప్పం, ఆగస్టు 26 ప్రభాతవార్త:**



ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు ఆదేశాలతో మున్సిపల్ పరిధి పదో క్లస్టర్‌లో ఇంటింటికీ తెదేపా కార్యక్రమంను వందశాతం పూర్తి చేసినట్లు కార్పోరేషన్ డైరెక్టర్ వేణుగోపాల్ పేర్కొన్నారు. మొత్తం 1685 గృహాలను ఐదు బూత్‌ల పరిధిలో సందర్శించి కూటమి ప్రభుత్వం రెండేళ్లలో చేపట్టిన అభివృద్ధి, సంక్షేమాలను వివరించి కరపత్రాలు పంపిణీ చేశామన్నారు. ఈ కార్యక్రమంకు ప్రజలనుంచి మంచి స్పందన లభించిందన్నారు. కార్యక్రమంలో బూత్ ఇన్‌చార్జ్‌లు లోకేష్, జాలు, ప్రసాద్, దేవా, మల్లయ్య నాయుడు, కెఎస్ఎస్ రాజా పాల్గొన్నారు.

## ప్రకృతి వ్యవసాయంతో అధిక లాభాలు

**- ఎఎంసి ఛైర్మన్ జిఎం రాజు**

**రామకుప్పం, ఆగస్టు 26 ప్రభాతవార్త:**




ప్రకృతి వ్యవసాయంతో రైతులు అధిక దిగుబడులు సాధించి లాభాలు పొందవచ్చని ఎఎంసి ఛైర్మన్ జిఎం రాజు పేర్కొన్నారు. బుధవారం పెద్దగానూరు గ్రామంలో డ్రిప్ ఇరిగేషన్ విధానంలో బొప్పాయి సాగుపై రైతులకు అవగాహన సదస్సు నిర్వహించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ రైతులు ఆధునిక వ్యవసాయ విధానాలపై అవగాహన పెంచుకోవాలన్నారు. పంటలకు రసాయనిక ఎరువుల వాడకం తగ్గించి సేంద్రీయ ఎరువుల వాడకం చేపట్టాలన్నారు. సిఎం చంద్రబాబునాయుడు సైతం వ్యవసాయ అనుబంధ విభాగాల్లో పంటలు సాగు చేసే రైతులకు పలు పథకాల ద్వారా తగు ప్రోత్సహకాలు కల్పిస్తున్నారన్నారు. రైతులు ప్రభుత్వ పథకాలను సద్వినియోగం చేసుకోవాలని కోరారు. కార్యక్రమంలో వైస్‌ఛైర్మన్ శరవణ, డైరెక్టర్ పవన్‌కుమార్, సిబ్బంది పాల్గొన్నారు.

## ఎస్సైను కలసిన ఎంఆర్‌పిఎస్ నేతలు

**రామకుప్పం, ఆగస్టు 26 ప్రభాతవార్త:**



రామకుప్పం నూతన ఎస్సై మారెప్పను మాదిగ రిజర్వేషన్ పోరాట సమితి నాయకులు బుధవారం మర్యాదపూర్వకంగా కలిశారు. ఈసందర్భంగా వారు ఎస్సైను ఘనంగా సత్కరించారు. కార్యక్రమంలో నేతలు వెంకటేష్, విజయ్, గోవిందప్ప, నాసిర్, ముబారక్ పాల్గొన్నారు.

ఫోటో రైటప్ :

1.ఎస్సైను సత్కరిస్తున్న నాయకులు (ఆర్‌కెపిఎం 2)

## ఇరు వర్గాల మధ్య ఘర్షణ...వృద్ధురాలికి గాయాలు

**పలమనేరు. ఆగస్టు 26 ప్రభాతవార్త:**



పలమనేరు మున్సిపాల్టీ పరిధిలోని గంటావూరులో బుధవారం ఉద్రిక్తత చోటు చేసుకుంది. ఇరు వర్గాలు ఘర్షణకు దిగడంతో ఓ వృద్ధురాలు తీవ్రంగా గాయపడింది. ఒక్కసారిగా అరుపులు కేకలు. బూతులతో ఇరు వర్గాలు చెలరేగి పోవడంతో స్థానికులు ఆందోళనకు గురయ్యారు. ఇరు వర్గాలకు చెందిన ఇల్లముందు పూలకుండీ లు.. మట్టి కుండలు.పూల చెట్లు ధ్వంసమయ్యాయి. విషయం తెలుసుకున్న పోలీసులు కంగా ప్రవేశం చేశారు. ఇంతకు ఈ ఘర్షణకు అసలు కారణం ఏమిటి వివాదం ఎలా ప్రారంభమైంది. అన్న విషయంపై వివరాలు సేకరిస్తున్నారు. పరిస్థితి విషమించకుండా తగిన జాగ్రత్తలు తీసుకుంటున్నారు.

## చేతి వృత్తిదారుల సమస్యలు పరిష్కరించండి. సిపిఐ



**పలమనేరు, ఆగస్టు 26 ప్రభాతవార్త:**

చేతివృతి దారుల సమస్యలు పరిష్కరిం చాలని ఆ సంఘం జిల్లా కార్యదర్శి పి.రఘు. సిపిఐ జిల్లా కార్యదర్శి ఏస్ నాగ రాజు డిమాండ్ చేశారు. ఈ మేరకు స్థానిక గంగమ్మతోపులో కరపత్రాలు విడుదల చేశారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ రాష్ట్ర వ్యాప్తంగా 30 రకాల చే వృత్తుల వారు ఉన్నారని తెలిపారు. వారి సమస్యలు గురించి ప్రభుత్వం పట్టించుకోవడం లేదన్నారు. చేతి వృతుల వారి సంక్షేమానికి ప్రత్యేక మంత్రిత్వ శాఖ ఏర్పాటు చేయాలని. ఉప ప్రణాళికతో చట్టబద్ధత కల్పించాలన్నారు. జనాభా ప్రాతిపదికన బడ్జెట్‌లో నిధులు కేటాయించాలని.. 50శాతం సబ్సిడీతో బ్యాంకు లింకేజి లేకుండా సొంత పూచీకత్తుతో రుణాలు మంజూరు చేయాలని. ప్రభుత్వ ప్రైవేటు రంగాల్లో 50 శాతం రిజర్వేషన్లు కల్పించాలని కోరారు.అలాగే పిల్లలకు కేజీ నుంచి పీజీ వరకు ఉచిత విద్య. 50ఏళ్ల దాటిన వారికి రూ 6వేలు పెన్షన్. పట్టణాల్లో 2సెంట్లు. గ్రామీణ ప్రాంతాలలో 3 సెంట్లు ఇళ్ల స్థలాలు కేటాయించా లన్నారు. దాసరిచంద్ర.సుబ్రమణ్యం.రామ్మూర్తి,గుర్రప్ప,బాబు,జ్యోతి,పద్మ, చెన్నకేశవులు తదితరులు పాల్గొన్నారు.

## సేవారత్న డా.మురుగన్‌కు కెంపెగౌడ అవార్డు

**పలమనేరు, ఆగస్టు 26 ప్రభాతవార్త:**

పలమనేరు మున్సిపాల్టీ పరిధిలోని గంటావూరు బీసీ కాలనీ గంగమ్మగుడి ఛైర్మెన్ సేవారత్న డా.మురుగన్ కు ప్రతిష్ఠాకర మైన కెంపెగౌడ అవార్డు లభించింది. కర్ణాటక రాష్ట్రం ప్రముఖ దివంగత నాయకుడు కెంపెగౌడ అవార్డు రావడం పట్ల సర్వత్ర హర్షం వ్యక్తమవుతోంది. ఈ మేరకు బుధవారం బెంగళూరులో డా.మురుగన్‌కు అవార్డు ప్రధానం చేశారు. కర్ణాటక సాంప్రదాయాలకు అనుగుణంగా నిర్వాహకులు బ్యాండు వాయిద్యాలు మేళా తాళాలతో డా. మురుగన్‌కు ఘన స్వాగతం పలికారు. ఇప్పటి వరకు ఆంధ్రా, తెలంగాణ, తమిళనాడు. పాండిచేరి తో పాటు కర్ణాటకలో ను. 15 సేవారత్న అవార్డులు. 7 డాక్టరేట్ లు లభించాయి.

## కులం పేరుతో దూషణ ఘటనపై కేసు నమోదు

**తవణంపల్లె, ఆగస్టు 26 ప్రభాతవార్త:**

మండలంలోని అరగొండ జడ్పీ బాలురోన్నత పాఠశాలలో విద్యార్థులను కులంపేరుతో దూషించారన్న ఆరోపణలపై విద్యార్థి తండ్రి యు.రఘు ఇచ్చిన ఫిర్యాదు మేరకు ఉపాధ్యాయుడు సునీల్‌కుమార్‌పై ఎస్సీ, ఎస్టీ అట్రాసిటీ కేసు నమోదు చేసినట్లు స్థానిక ఎస్సై జి.రమేష్‌బాబు తెలిపారు. ఎస్సై కథనం మేరకు వివరాలిలావున్నాయి.అరగొండ జడ్పీ ఉన్నత పాఠశాలలో ఉపాధ్యాయుడిగా పనిచేస్తున్న సునీల్‌కుమార్ పాఠశాలలో చదువుతున్న 8వ తరగతి విద్యార్థి యు.లారన్‌ను ఈనెల 20న ఉదయం ప్రార్థనా సమావేశం సందర్భంగా పాఠశాల హెచ్ఎం, ఇతర ఉపాధ్యాయుల సమక్షంలో కులంపేరుతో దూషించి అవమానించినట్లు విద్యార్థి తండ్రి అరగొండ చారాల ఎస్సీవాడకు చెందిన యు.రఘు అనే వ్యక్తి బుధవారం తవణంపల్లె పోలీసులకు ఫిర్యాదు చేశారు. విద్యార్థి తండ్రి ఇచ్చిన ఫిర్యాదు మేరకు నిందితుడు ఉపాధ్యాయుడు సునీల్‌కుమార్‌పై ఎస్సీ, ఎస్టీ అట్రాసిటీ కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై తెలిపారు. ఇదిలా వుండగా విద్యార్థి లారన్‌ను కులంపేరుతో దూషణ ఘటనపై విద్యార్థి తల్లిదండ్రులు, జిల్లా దళిత సంఘం నాయకులు, బిఎస్పీ నాయకులు మండల, జిల్లా విద్యాశాఖాధికారులకు, మానవ హక్కుల కమీషన్‌కు ఫిర్యాదు చేయడంతో చిత్తూరు డీవైఈఓ ఇందిర ఆధ్వర్యంలో విచారణ కమిటీ ఈనెల 22న పాఠశాలకు చేరుకుని విచారణ నిర్వహించి ఇచ్చిన నివేదిక ఆధారంగా ఉపాధ్యాయుడు సునీల్‌కుమార్‌ను సస్పెన్షన్ చేసిన విషయం విధితమే.

## కోర్టు ఆదేశాలతో...సీఇఒగా విజయ్ కుమార్

**గంగాధర నెల్లూరు ఆఘుష్టు 26 ప్రభాత వార్త:**



మండలంలోని వ్యవసాయ సహకార సంఘ సిఇఒగా కోర్టు ఆదేశాల మేరకు మరోమారు బాధ్యతలు చేపట్టారు. విజయ్ కుమార్‌ను 60 సంవత్సరాలు నేపధ్యంలోసీఇఒగా పదవీ విరమణ చేయాల్సి వచ్చింది అయితే ప్రస్తుత ప్రభుత్వం ఉద్యోగుల వయో పరిమితి 62సంవత్సరాలు పెంచడంతో ఈయన ఉన్నత న్యాయస్థానాన్ని ఆశ్రయించారు. ఈ మేరకు న్యాయస్థానంజిల్లా కేంద్ర సహకార సంఘానికి ఇతనిని 62 సంవత్సరాలు కొనసాగించాలంటూ ఉత్తర్వులు జారీ చేసింది. ఈ మేరకు జిల్లా కేంద్ర సహకార బ్యాంకు ఛైర్మన్ అమాస రాజశేఖర్ రెడ్డి ఆదేశాలతో సహకార సంఘ ముఖ్య కార్యనిర్వహణ అధికారి సి శంకర్ బాబు మరో రెండేళ్ల పాటు బాధ్యతలు చేపట్టడానికి ఉత్తర్వులు జారీ చేశారు.ఈ మేరకు జిల్లా ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘం ఉద్యోగస్తుల తెలుగునాడుట్రేడ్ యూనియన్ అధ్యక్షులు మరియు రాష్ట్ర ఉపాధ్యాక్షులుగా ఉన్న విజయ్‌కుమార్ ప్రస్తుతం సిఇఒగా బాధ్యతలను స్వీకరించారు.దీనికి సహకరించిన స్థానిక ఎమ్మెల్యే విఎం థామస్ పాలక వర్గ సభ్యులుఇమ్మానుయేల్ జ్యోతి యాదవ్‌లకు కృతజ్ఞతలు తెలియజేశారు.

## ఆసుపత్రుల అభివృద్ధికి దాతల సహకారం అభినందనీయం

**గంగాధర నెల్లూరు ఆఘుష్టు 26ప్రభాత వార్త:**



ఆసుపత్రుల అభివృద్ధికి దాత సహకారం అభినందనీయమని స్తానిక ఎమ్మెల్యే విఎం థామస్ అన్నారు. మండలంలోని ఎట్టేరి వద్ద ఉన్న శ్రీ బానోదయ విద్యా సంమస్థల స్థాపకులు లావణ్య నాగేశ్వరరావులుస్థానిక ఎమ్మెల్యే చేతుల మీదుగా గంగాధర నెల్లూరు ప్రభుత్వసుపత్రికి కార్డియాక్ మానిటర్‌ను బుధవారం వితరణ చేశారు.ఈ సందర్భంగా దాత మాట్లాడుతూవిద్యార్థులను విజ్ఞానవంతులు చేయడంతో పాటు రోగులకు కూడా ఇలాంటి సాయం అందించడం మనసుకు ఆనందంగా ఉందని భవిష్యత్తులో మరిన్ని అభివృద్ధి కార్యక్రమాల్లో పాల్గొని ప్రయత్నిస్తామని తెలిపారు. ఈ కార్యక్రమంలో నాయకులు కృష్ణం నాయుడు పొన్న యుగంధర్ స్వామిదాస్ వైద్యాధికారులు ప్రమీన్ గురుప్రకాష్ నాయకులు మోహన్ నాయుడు కోదండ రెడ్డి దేవసుందరం హరీష్ యాదవ్‌శ్రీధర్ యాదవ్ కృష్ణన్ గోపి ప్రకాష్ రాజేష్‌లతో పాటు పలువురు పాల్గొన్నారు.

## వేగంగా ఎస్సీ,ఎస్టీలకు ఉచిత సోలార్ కనెక్షన్లు



**బైరెడ్డిపల్లి, ఆగస్టు26 ప్రభాతవార్త:**

కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు అమలు చేస్తున్న పిఎం సూర్యఘర్ పథకంలో భాగంగా ఎస్సీ,ఎస్టీలకు ఉచితంగా ఇళ్లకు సోలార్ విద్యుత్ కనెక్షన్లు అందిస్తున్న విషయం విదితమే. మండలంలోని గౌనితిమ్మేపల్లి పంచాయతీలో ఈ కార్యక్రమంను శరవేగంగా చేపడుతూ ఎస్సీ,ఎస్టీల నివాసాలకు వందశాతం ఉచితంగా కనెక్షన్లను అందజేస్తున్నారు. ఇదే పథకంలో బిసిలకు 76 వేల రాయితీతో సైతం కనెక్షన్లు అందించేందుకు అధికారులు చర్యలు చేపట్టారు.

# చిత్తూరు డివిజన్

చిత్తూరు, గంగాధరనెల్లూరు, పూతలపట్టు పలమనేరు, కుప్పం,

## వసంతకుమార్ కుటుంబానికి సిఎం పరామర్శ

**- త్వరలో అమరావతికి వచ్చి తనను కలవాలని సూచన**

**చిత్తూరు, ఆగస్టు 26 ప్రభాతవార్త:**



గుండెపోటుతో మృతి చెందిన సీనియర్ తెలుగుదేశం నాయకులు వసంత్‌కుమార్ కుటుంబ సభ్యులను ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు బుధవారం ఫోన్‌లో పరామర్శించారు. వసంతకుమార్ కుటుంబానికి తెలుగుదేశం పార్టీ అండగా వుంటుందని, త్వరలో అమరావతికి వచ్చి తనను కలవాలని ఆయన వసంతకుమార్ కుటుంబసభ్యులకు సూచించారు. అలాగే వసంతకుమార్ కుటుంసభ్యులకు దగ్గరుండి బాసటగా నిలవాలని ఎమ్మెల్యే గురజాల జగన్మోహన్‌నాయుడును సిఎం ఆదేశించారు. రెండు రోజుల క్రితం గుండెపోటుతో మృతి చెందిన వసంతకుమార్ భార్య శిల్ప, పిల్లలు మోక్షశ్రీ, డమరకేశ్వర్‌లతో సిఎం బుధవారం ఫోన్‌లో వీడియో కాల్ ద్వారా పరామర్శించి మాట్లాడారు. ఎమ్మెల్యే గురజాల సిఎంకు ఫోన్ చేసి వసంత్‌కుమార్ భార్య, పిల్లలతో మాట్లాడించారు. పార్టీ కోసం అహర్నిశలు కృషి కష్టపడే కార్యకర్త వసంత్‌కుమార్ మృతి తనను తీవ్ర దిగ్భ్రాంతికి గురి చేసిందని, తాను వసంత్‌కమార్ కుటుంబానికి అండగా వుంటానని ధైర్యం చెప్పారు. అలాగే ధైర్యంగా ముందుకు సాగాలని, పిల్లలను బాగా చూసుకోవాలన్నారు. ఏ అవసరం వున్న ఆ కుంటుంబసభ్యులకు అండగా వుండాలని ఎమ్మెల్యే గురజాల జగన్మోహన్‌నాయుడుకు చెప్పారు. అలాగే వీలు చూసుకుని పిల్లలను తన వద్దకు తీసుకురావాలని ఎమ్మెల్యే గురజాల జగన్మోహన్‌నాయుడుకు సూచించారు.

## ప్రశాంత్‌నగర్ అర్బన్ పిహెచ్‌సికి తాళం




**చిత్తూరుహెల్త్, ఆగస్టు 26 ప్రభాతవార్త:**

చిత్తూరు అర్బన్ పరిధిలోని ప్రశాంత్‌నగర్ పిహెచ్‌సికి బుధవారం తాళం వేశారు. బుధవారం ప్రభుత్వ సెలవు రోజైనప్పటికీ అత్యవసరంగా ఆరోగ్య సేవలు నిర్వర్తించడానికి పిహెచ్‌సిలో ఒక స్టాఫ్ నర్సు వుండి విధులు నిర్వర్తించాలి. అయితే ఇదేమి పట్టించుకోకుండా వైద్య ఆరోగ్యశాఖ అధికారులు దర్జాగా ప్రశాంత్ నగర్ పిహెచ్‌సికి తాళం వేసి పిహెచ్‌సికి సెలవు ప్రకటించి వెళ్ళిపోయారు. అర్బన్ పిహెచ్‌సిలో వైద్యాధికారిగా విధులు నిర్వర్తించే డాక్టర్ తమ సిబ్బంది విధులు సక్రమంగా నిర్వర్తిస్తున్నారో! లేదో! అని పరిశీలించాల్సి వుంటుంది. అయితే ఈ ఆరోగ్య కేంద్రంలో పిహెచ్‌సి డాక్టరే సిబ్బంది తీరుకు మద్దతుగా వుంటుండటంతో ఇక్కడ ఈ పరిస్థితి నెలకొంది. ఏది ఎమైనా ప్రశాంత్‌నగర్ పరధిలో ఎదైనా అత్యవసర కేసు వచ్చిన సమయంలో పిహెచ్‌సి మూసి వుంటే పరిస్థితి ఏమిటని స్థానిక ప్రజలు ప్రశ్నిస్తున్నారు. ఈ వ్యవహారంపైజిల్లావైద్యఆరోగ్యశాఖ అధికారులు స్పందించి చర్యలు తీసుకోవాలని స్థానికులు వేడుకుంటున్నారు.

## అపోలోలో కృత్రిమ మేధస్సు హ్యాకథాన్ ప్రారంభం




**చిత్తూరు, ఆగస్టు 26 ప్రభాతవార్త:**

ది అపోలో యూనివర్సిటీ వేదికగా కృత్రిక మేధస్సు హ్యాకథాన్-2026 బుధవారం ఘనంగా ప్రారంభమైంది. విద్యార్థుల్లో సాంకేతికత, ఆవిష్కరణలపై ఆసక్తి పెంపందించేందుకు దిక్సూచి ఎడ్టెక్, అపోలో యూనివర్సిటీ సంయుక్తంగా ఈ కార్యక్రమంను నిర్వహించాయి. ఈ కార్యక్రమంను ప్రారంభించిన ప్రో వైస్ ఛాన్సలర్ డాక్టర్ అల్ఫ్రెడ్ జె.ఆగస్టీన్ మాట్లాడుతూ పెద్ద ఆలోచనలే గొప్ప పరిష్కారాలకు దారి తీస్తాయని, విద్యార్థులు తమ సృజనాత్మకతను ఆచరణలోకి తీసుకురావాలని సూచించారు. అపోలో యూనివర్సిటీ విద్యార్థుల్లో ఆవిష్కరణాత్మక దృక్పథంను పెంపొందించడానికి ఇలాంటి కార్యక్రమాలు నిరంతరం నిర్వహిస్తుంటోందన్నారు. దిక్సూచి ఎడ్టెక్ స్థాపకులు కె.లోకేశ్వర్‌రెడ్డి మాట్లాడుతూ ఒక చిన్న ఆలోచనగా ప్రారంభమైన ఈ సంస్థ విద్యార్థులకు సాంకేతిక ఆధారిత అభ్యాసానికి వేదికగా మారిందన్నారు. ఈ హ్యాకథాన్‌లో ఆంధ్రప్రదేశ్, కర్ణాటక, తమిళనాడు రాష్ట్రాల నుండి వచ్చిన విద్యార్థులు పాల్గొని కృత్రిక మేధస్సు ఆధారిత పరిష్కారాలపై పని చేయను న్నారన్నారు. ఈ కార్యక్రమంలో ఎఐఎంఎస్ఆర్ డీన్ డాక్టర్ రమ్య రామకృష్ణన్, స్కూల్ ఆఫ్ టెక్నాలజీ డీన్ డాక్టర్ డి.జగదీశన్, స్కూల్ ఆఫ్ మేనేజ్‌మెంట్ డీన్ డాక్టర్ రామయ్య ఇటుమల్ల, కన్వీనర్ డాక్టర్ కె.సుధీర్, అధ్యాపకులు, నిర్వాహకులు, విద్యార్థులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

## సర్వీసు టీచర్లకు టెట్ రద్దు

**- డిఇఓ కార్యాలయం ఎదుట ఎపిటిఎఫ్-1938 ఆధ్వర్యంలో ధర్నా**




**చిత్తూరు, ఆగస్టు 26 ప్రభాతవార్త:**

సర్వీసు ఉపాధ్యాయులకు టెట్ అర్హత పరీక్ష రద్దు చేయాలని డిమాండ్ చేస్తూ బుధవారం జిల్లా విద్యాశాఖ కార్యాలయం ఎదుట ఎపిటిఎఫ్-1938 ఆధ్వర్యంలో ఉపాధ్యాయులు ధర్నా నిర్వహించారు. ఈ ధర్నాను ఉద్దేశించి ఎపిటిఎఫ్-1938 జిల్లా ప్రధాన కార్యదర్శి డాక్టర్ ఎం.గిరిబాబు, ఆర్‌టిఎఫ్ రాష్ట్ర కో-కన్వీనర్ చెంగల్‌రాయ మందడిలు మాట్లాడుతూ సర్వీసు టీచర్లకు ప్రత్యేకంగా విడుదల చేసిన టెట్ నోటిఫికేషన్‌లో ఎపిటిఎఫ్ ప్రాతినిథ్యం మేరకు సవరణలు చేయాలని డిమాండ్ చేశారు.విద్యాశాఖ చట్టం-2009 సెక్షన్23(1)కి సవరణలు చేపట్టాలని, స్పెషల్ టెట్‌లో అందరికి కామన్‌గా 40 శాతం అర్హత మార్కులు కల్పించాలని, పరీక్షలను కంప్యూటర్ విధానంలో కాకుండా ఆఫ్‌లైన్‌లో నిర్వహించాలని డిమాండ్ చేశారు. అలాగే సబ్జెక్టు ఉపాధ్యాయులకు వారి సంబంధిత సబ్జెక్టులోనే పరీక్షలు నిర్వహించాలని, విద్యాశాఖ మంత్రి సత్వరం ఉపాధ్యాయ సంఘాలతో చర్చించాలని డిమాండ్ చేశారు. ఈ ధర్నా కార్యక్రమంలో రాష్ట్ర ఎపిటిఎఫ్ కార్యదర్శి చిట్టిబాబు, జిల్లా కార్యదర్శులు రెడ్డి వాణి, సురేష్‌బాబులు, బంగారుపాళ్యం మండల అధ్యక్షులు సామివేలు, ప్రధాన కార్యదర్శి శివరంజని, కార్వేటినగరం ప్రధాన కార్యదర్శి ధనంజయ తదితరులు పాల్గొన్నారు.

## రేపు అర్ధగిరిలో రాఖీపౌర్ణమి వేడుకలు

**తవణంపల్లె, ఆగస్టు 26 ప్రభాతవార్త:**

ప్రముఖ పుణ్యక్షేత్రమైన అరగొండ అర్ధగిరి శ్రీవీరాంజనేయస్వామి దేవస్థానంలో శుక్రవారం రాఖీ పౌర్ణమి వేడుకలను ఘనంగా నిర్వహించనున్నట్లు ఆలయ ఛైర్మన్ ఎ.రఘుపతి, ఈఓ ఇ.మునిశేఖర్‌లు తెలిపారు. ఈమేరకు ఆలయంలో అర్చకులు ఉదయంస్వామివారి మూలవిరాట్‌కు పంచామృతాభిషేకం, ప్రత్యేకపూజలు, సుదర్శనహోమం, ఆకుపూజ, వడమాలసేవ, మధ్యాహ్నం సహస్రనామార్చన, ఆకుపూజ రాత్రి ప్రాకారోత్సవంను ఘనంగా నిర్వహించనున్నట్లు తెలిపారు. ఈవేడుకల్లో భక్తులు పెద్దఎత్తున పాల్గొని స్వామివారి కృపకు పాత్రులు కావాలని వారు కోరారు.

27CTR 3:27CTR 3.qxd 8/26/2026 10:40 PM Page 1



## కొత్తగా 15మంది పోలీసుల నియామకం

**కుప్పం, ఆగస్టు 26 ప్రభాతవార్త:**

చిత్తూరు జిల్లా ఎస్పీ తుషార్ డూడీ కుప్పం పోలీస్ సబ్‌డివిజన్‌కు కొత_్తగా పదిహేను మంది పోలీసులను నియమిస్తూ ఉత్తర్వులు జారీ చేశారు. గతంలో కుప్పం డివిజన్ నుంచి 22 మంది బదిలీ అయిన విషయం విదితమే. దీంతో ఆయా పోలీస్‌స్టేషన్‌ల పరిధిలో ఖాళీలు భర్తీ అయ్యేలా జిల్లా ఎస్పీ చర్యలు చేపట్టారు. పదిహేను మంది సిబ్బందిని కుప్పం అర్బన్ పిఎస్, రాళ్లబూదుగూరు, రామకుప్పం, గుడుపల్లె పోలీస్‌స్టేషన్ల పరిధిలో నియమించారు.

## కుప్పం తహాశీల్దార్‌గా శివయ్య నియామకం



**కుప్పం, ఆగస్టు 26 ప్రభాతవార్త :**

మండల తహాశీల్దార్‌గా శివయ్యను నియమిస్తూ జిల్లా కలెక్టర్ సుమిత్‌కుమార్ ఉత్తర్వులు జారీ చేశారు. కుప్పంలో తహాశీల్దార్‌గా పనిచేస్తున్న రమేష్‌బాబును చితూ_రు కలెక్టర్ కార్యాలయంలో అడ్మినిస్ట్రేటివ్ అధికారిగా నియమించారు. తహాశీల్దార్ శివయ్య ప్రస్తుతం కడ కార్యాలయంలో తహాశీల్దార్‌గా పనిచేస్తూ డెప్యుటేషన్‌పై కుప్పం తహాశీల్దార్‌గా నియమితులయ్యారు.

## శాంతిపురం తహాశీల్దార్‌గా ప్రకాష్‌బాబు



**శాంతిపురం, ఆగస్టు 26 ప్రభాతవార్త :**

మండల తహాశీల్దార్‌గా ప్రకాష్‌బాబును నియమితులయ్యారు. ఈమేరకు జిల్లా కలెక్టర్ సుమిత్‌కుమార్ ఉత్తర్వులు జారీ చేశారు. ఈయన ప్రస్తుతం కడ కార్యాలయంలో ఉప తహాశీల్దార్‌గా పనిచేస్తున్నారు. శాంతిపురంలో తహాశీల్దార్‌గా పనిచేస్తున్న తనూజను నగరి ఆర్డీఒ కార్యాలయంకు అడ్మినిస్ట్రేటివ్ అధికారిగా డెప్యుటేషన్‌పై నియమించారు. తహాశీలా_ద్ర్ ప్రకాష్‌బాబు గురువారం బాధ్యతలు చేపట్టనున్నారు.

## బండపల్లి వద్ద గుర్తు తెలియని వ్యక్తి మృతదేహం

**శాంతిపురం, ఆగస్టు 26 ప్రభాతవార్త**



మండలంలోని సి. బండపల్లి గ్రామం నుంచి ద్రవిడ వర్సిటీకి వెళ్లే మార్గంలో కృష్ణమూర్తి అనే వ్యక్తి ఇంటి సమీపంలో ఓ గుర్తు తెలియని వ్యక్తి మృతదేహం లభ్యమైనట్లు రాళ్లబూదుగూరు ఎస్సై నరేష్ తెలిపారు. మృతి చెందిన వ్యక్తి సుమారు 5.6అడుగుల ఎత్తు ఉ ంటాడన్నారు. ఎడమచేతిపై అవని అమ్మ, ఆంగ్లంలో మమత, అనే అక్షరాలు పచ్చబొట్టుగా కుడిచేతిపై శివ అనే ఆంగ్ల అక్షరాలు పచ్చబొట్లు ఉన్నట్లు గుర్తించామన్నారు. మృతుడికి గడ్డంకింద భాగంలో పాతగాయం ఉందన్నారు. సదరు వ్యక్తిని ఎవరైనా గుర్తిస్తే రాళ్లబూదుగూరు పోలీసులకు సమాచారం అందించాలన్నారు. విఆర్‌ఎ గంగులప్ప ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు తెలిపారు.

## వాహన తనిఖీలు నిర్వహించిన పోలీసులు.



**రైల్వేకోడూరు అర్బన్, ఆగస్టు 26 ప్రభాతవార్త :**

తిరుపతి జిల్లా ఎస్పీ ఎల్.సుబ్బారాయుడు, ఆదేశాల మేరకు, రేణిగుంట డిఎస్‌పి శ్రీనివాస రావు సూచనల మేరకు రహదారి ప్రమాదాలను నివారించడంలో భాగంగా రైల్వే కోడూరు టౌన్ సీఐ చంద్రశేఖర్ రైల్వే కోడూరు పట్టణం లోని మామిడికాయల మండి దగ్గర వాహన తనిఖీలు నిర్వహించారు. ఈ తనిఖీలలో మద్యం సేవించి వాహనాలు నడుపుతున్న వారిపై ప్రత్యేక దృష్టి సారించి మద్యం సేవించి వాహనాలు నడుపుతున్న 2 గూడ్స్ లారీలు, ఒక కారును గుర్తించి పట్టుకుని సదరు వాహనాలను సీజ్ చేసి గౌరవ కోర్టు వారి ముందు హాజరు పరచారు. మద్యం సేవించి వాహనాలు నడపడం వల్ల రోడ్డు ప్రమాదాలు జరిగే అవకాశం ఎక్కువగా ఉంటుందని, మద్యం సేవించి వాహనం నడిపితే కఠిన చర్యలు తీసుకుంటామని సీఐ హెచ్చరించారు. వాహనదారులు తప్పనిసరిగా ట్రాఫిక్ నిబంధనలు పాటిస్తూ, మద్యం సేవించి వాహనం నడపకుండా తమతో పాటు ఇతరుల ప్రాణాలను కూడా కాపాడాలని సూచించారు. రహదారి ప్రమాదాల నివారణకు వాహన తనిఖీలు మరియు డ్రంక్ అండ్ డ్రైవ్ తనిఖీలు నిరంతరం కొనసాగుతాయని సీఐ తెలిపారు.

## చవితి పండుగను ప్రశాంతంగా జరుపుకోవాలి : ఎస్ఐ



**ఓబులవారిపల్లి, ఆగస్టు 26 ప్రభాతవార్త:**

గ్రామాలలో ఉన్న ప్రజలు రానున్న వినాయక చవితి ఉత్సవాల్లో భాగంగా పండుగను ప్రశాంత వాతావరణంలో జరుపుకోవాలని ఓబులవారిపల్లి ఎస్సై సుజన్ కుమార్ సూచించారు బుధవారం స్థానిక పోలీస్ స్టేషన్లో ఓబులవారిపల్లి మండలంలో ఉన్న 22 పంచాయతీలోనూ గ్రామాల కమిటీ సభ్యులతో సమావేశం ఏర్పాటు చేశారు ఈ సందర్భంగా కమిటీ సభ్యుల నిర్దేశించే మాట్లాడుతూ. 9వ నెల 14వ తేదీన జరగనున్న. వినాయక చవితి పండుగ సందర్భంగా ఏర్పాటు వివరాలను కమిటీ పెద్దలు పోలీస్ స్టేషన్ నుంచి అనుమతి పొందాలని ఎక్కడ ఎటువంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా ప్రశాంతంగా భక్తులు భక్తిశ్రద్ధలతో వినాయక చవితి ఉత్సవాలను జరుపుకోవాలన్నారు ఎక్కడైనా గొడవలకు పాల్పడిన అవాంఛనీయ సంఘటనలకు పాల్పడిన కఠిన చర్యలు తీసుకుంటామని ఆయన సూచించారు ఈ కమిటీ రైల్వేకోడూరు రూరల్ సీఐ డీ శ్రీనివాసులు ఆదేశాల మేరకు ఏర్పాటు చేయడం జరిగిందన్నారు ఈ కార్యక్రమంలో పలువురు గ్రామాల కమిటీ పెద్దలు తదితరులు పాల్గొన్నారు

## విగ్రహా ఏర్పాట్ల పర్యవేక్షణ బాధ్యత కమిటీలదే : ఎస్ఐ




**చిట్వేలి, ఆగస్టు 26 ప్రభాతవార్త:**

వినాయక చవితి పండుగ సందర్భంగా ఏర్పాటు చేసే విగ్రహాల పూర్తి పర్యవేక్షణ బాధ్యత సంబంధిత కమిటీలదేనని స్థానిక ఎస్సై వినోద్ కుమార్ వెల్లడించారు. బుధవారం ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు పోలీస్ స్టేషన్ ప్రాంగణంలో ఉత్సవ కమిటీ సభ్యులచే సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎస్సై మాట్లాడుతూ ముందుగా అనుమతించిన ప్రదేశాలలోనే విగ్రహాలను ఏర్పాటు చేయాలన్నారు. చుట్టూ ఉన్నవారికి ఎలాంటి ఇబ్బంది లేకుండా తక్కువ శబ్దంతో భక్తి పాటలను నిర్వహించాలన్నారు. రాజకీయ పార్టీల ఉద్దేశించే పాటలు గానీ, అశ్లీలతతో కూడిన డీజే పాటలు గాని నిషిద్ధమన్నారు. అన్ని గ్రామాలలోనూ ముందస్తు అనుమతులతో విగ్రహాలు ఏర్పాటు చేసుకుని భక్తిశ్రద్ధలతో పండుగను జరుపుకోవాలని అన్నారు. ఏర్పాటుచేసిన ప్రతిమలను మూడు రోజుల లోపల నిమజ్జన ఏర్పాట్లు చేయాలన్నారు. నిమజ్జన సమయంలో, బాణాసంచా పేల్చే సమయంలో అత్యంత జాగ్రత్తలు తీసుకోవాలని సూచించారు. మద్యం సేవించి నిమజ్జనం చేసే వాహనాన్ని నడపరాదన్నారు. రాజకీయ పార్టీల జెండాలు,నినాదాలు, పాటలు వినిపించరాదని తాము సూచించిన సమయంలో మాత్రమే నిశ్శబ్దంగా నిమజ్జనం చేసే స్థలానికి చేరుకోవాలన్నారు. ఎవరికి ఎలాంటి ఇబ్బంది కలిగినా, అల్లర్లు సృష్టించినా, గొడవలకు దిగినా పూర్తి బాధ్యత ఉత్సవ కమిటీల దేనని వారిపై కఠిన చర్యలు తీసుకుంటామని స్థానిక ఎస్సై వినోద్ కుమార్ హెచ్చరించారు. కార్యక్రమంలో పోలీస్ సిబ్బంది, మండల పరిధిలోని అన్ని గ్రామాల ఉత్సవ కమిటీ సభ్యులు పాల్గొన్నారు.

## ముఖ్యమంత్రి సహాయనిధి పేదలకు ఒక వరం : ఎమ్మెల్యే



**రైల్వేకోడూరు రూరల్, ఆగస్టు 26 ప్రభాతవార్త :**

రైల్వే కోడూరు నియోజకవర్గ ప్రజల అనారోగ్య బాధితులకు ముఖ్యమంత్రి సహాయనిధి ఒక వరమని రైల్వేకోడూరు ఎమ్మెల్యే అరవ శ్రీధర్, డిసిఎంఎస్ చైర్మన్ ఎర్రగుండ్ల జయప్రకాష్, టిడిపి యువ నాయకులు ముక్కా సాయి వికాస్ రెడ్డిలు అన్నారు. ఈ సందర్భంగా రైల్వేకోడూరు మండలంలోని మాధవరం పోడు, అనంతరాజుపేట, వెంకటరెడ్డి పల్లి తదితర గ్రామీణ ప్రాంతాలలో మంజూరైన ముఖ్యమంత్రి సహాయనిధి చెక్కులను పంపిణీ చేశారు. వారు మాట్లాడుతూ రైల్వే కోడూరు నియోజకవర్గంలో అత్యధికంగా ముఖ్యమంత్రి సహాయనిధి మంజూరు చేస్తున్నారని అదేవిధంగా బాధితులకు ఇళ్ల వద్దకే వెళ్లి సహాయనిధి చెక్కులను అందజేస్తున్నామని వారు తెలిపారు. ఇప్పటికే ఎన్నో వేల మందికి ముఖ్యమంత్రి సహాయనిధి చెక్కులను అందజేస్తున్నామని ప్రతి ఒక్క నిరుపేద ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని వారు తెలిపారు. ఈ కార్యక్రమంలో క్లస్టర్ ఇంచార్జ్ పటాన్ మోలా, సాయి, శేఖర్ రాజు,నాగమణి,ఆకేపాటి సుకుమార్ రెడ్డి, అరవింద్ తో పాటు టిడిపి మాజీ మండల అధ్యక్షుడు పందేటి వెంకటరామరాజు, మద్దెన గిరి, సుబ్బరాగ్గావులు పలువురు కూటమికి చెందిన నాయకులు పాల్గొన్నారు.

## సిహెచ్ ఎస్ సభ్యునికి ఆర్థిక చేయూత



**చిట్వేలి, ఆగస్టు 26 ప్రభాతవార్త:**

పలు సేవలతో అండగా నిలుస్తున్న చిట్వేలి హెల్పైన్ సొసైటీ సంస్థలోని సభ్యుని కుటుంబానికి సిహెచ్‌ఎస్ సభ్యులు ఆర్థిక సాయం అందించి భరోసాగా నిలిచారు. మండల కేంద్రమైన శ్రీ సాయి జూనియర్ మరియు డిగ్రీ కళాశాల వ్యవస్థాపకులు నూకా శ్రీనివాసులురెడ్డి ఇటీవల అనారోగ్యంతో మృతి చెందారు. శ్రీనివాసులురెడ్డి సిహెచ్‌ఎస్ సంస్థలో సభ్యుడిగా ఉండడంతో ఇన్సూరెన్స్ పద్ధతి ద్వారా ఆయన కుటుంబానికి బుధవారం సిహెచ్‌ఎస్ సభ్యులు యాభై వేల రూపాయల నగదును అందించి ఆసరాగా నిలిచారు. ఈ సందర్భంగా సిహెచ్‌ఎస్ సభ్యులు మాట్లాడుతూ విద్యారంగంలో తనదైన ముద్రను వేసుకుని ఎంతోమంది విద్యార్థులకు విద్యను అందించిన శ్రీనివాసులురెడ్డి ఆకస్మిక మరణం బాధ కలిగించిందన్నారు. ఇలాంటి ఇబ్బందికరమైన పరిస్థితిలో కుటుంబానికి ఆర్థిక భరోసా ఇచ్చేందుకు సంస్థ సభ్యులు మేమున్నామని ముందుకు వచ్చారన్నారు. ఈ కార్యక్రమంలో సి హెచ్ ఎస్ సభ్యులు భాస్కర్ రెడ్డి, ఇంతియాజ్, బొంతల నాగేశ్వరరావు, సురేష్ నాథ్, విశ్రాంత ఉపాధ్యాయులు రంగారెడ్డి, శివారెడ్డి, మోహన్, తదితరులు పాల్గొన్నారు.

## తెలుగుదేశం పార్టీతోనే గ్రామాల అభివృద్ధి : విశ్వనాథ నాయుడు



**పెనగలూరు, ఆగస్టు 26 ప్రభాతవార్త :**

పెనగలూరు మండలంలో తెలుగుదేశం పార్టీ తోనే గ్రామాల అభివృద్ధి సాధ్యమని టీడీపీ రాష్ట్ర కార్యనిర్వాహక కార్యదర్శి కస్తూరి విశ్వనాథనాయుడు తెలిపారు. బుధవారం పెనగలూరు మండల పరిధిలో డోర్ డోర్ కార్యక్రమంలో ఆయన పాల్గొన్నారు. అంతకు ముందు టీడీపీ మండల కార్యాలయంలో కార్యకర్తలతో సమావేశం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో టీడీపీ మండల అధ్యక్షులు ఎంజర్ల నారాయణరెడ్డి, ప్రధాన కార్యదర్శి పుచ్చకాయల రవి కుమార్, మాజీ సర్పంచ్ మారంరెడ్డి ఈశ్వరమ్మ, మారంరెడ్డి నరసింహ, నాయకులు ముక్కర శంకరయ్య, తుమ్మల రమణయ్య నాయుడు, మైనార్టీ నాయకుడు షామీర్ బాషా, నాగినేని మురళి, కాకర్లవారి పల్లి శివ, యువ నాయకుడు ఎంజర్ల సాయి కుమార్ రెడ్డి పాల్గొన్నారు.

## ఆశ్రమానికి నిత్యవసర వస్తువులు వితరణ




**చిట్వేలి, ఆగస్టు 26 ప్రభాతవార్త :**

మండల పరిధిలోని తిమ్మాయపాలెం క్రాస్ రోడ్డు వద్ద కీర్తిశేషులు నారాయణమ్మ స్థాపించిన శ్రీ శ్రీ దత్తగిరి నారాయణ తపోవన ఆంజనేయ స్వామి ఆశ్రమానికి ధర్మనిధి చారిటబుల్ ట్రస్ట్ సభ్యులైన బీము వెంకటసుబ్బారెడ్డి ధర్మపత్ని కుసుమకుమారి పెళ్లిరోజు సందర్భంగా బుధవారం వృద్ధ ఆశ్రమానికి బియ్యము, కూరగాయలు, పప్పు దినుసులు, పండ్లు ఆలయ పీఠాధిపతి నాగేశ్వరమ్మకు చారిటబుల్ ట్రస్ట్ సభ్యులు నాగిరెడ్డి చంద్రశేఖర్‌రెడ్డి, పురం రామ్మోహన్ మరియు వలసాని గోపాల్ స్వయంగా అందించారు. ఆశ్రమ అవసరాలను గుర్తించి వారి ఇంటి జరిగే శుభకార్యాల సమయాలలో దాతలు ముందుకు వచ్చి వారికి తోచినవి వితరణగా ఇవ్వడం ఆసరాగా నిలవడం సంతోషకరమని ఆశ్రమ నిర్వాహకులు నాగేశ్వరమ్మ, చంద్రశేఖర్ లు అన్నారు.

## గుర్తుతెలియని మృతదేహం లభ్యం



**తొట్టంబేడు, ఆగస్టు 26 ప్రభాతవార్త:**

శ్రీకాళహస్తి మండలం చిన్న సింగమల వద్ద తెలుగు గంగ కాలువలో బుధవారం సాయంత్రం గుర్తు తెలియని మగ వ్యక్తి మృతదేహం కొట్టుకు వస్తుండగా స్థానికులు గుర్తించి పోలీసులకు స మా చా ర ం ఇచ్చారు. సమాచారం అందుకున్న వెంటనే శ్రీకాళహస్తి టూటౌన్ సీఐ కె. నాగరాజు సిబ్బందితో ఘటనా స్థలానికి చేరుకుని స్థానికుల సహాయంతో మృతదేహాన్ని కాలువ నుంచి బయటకు తీశారు. మృతుని వయసు సుమారు 50 సంవత్సరాలు ఉంటుందని పోలీసులు తెలిపారు. మృతుని వివరాలు తెలిసిన వారు శ్రీకాళహస్తి టూ టౌన్ పోలీస్ స్టేషన్‌ను ఫోన్ నెంబర్ 9440900008 సంప్రదించాలని ఇన్స్పెక్టర్ నాగరాజు కోరారు.

# తిరుపతి డివిజన్

## అన్నదాన పథకానికి విరాళం



**శ్రీకాళహస్తి, ఆగస్టు 26 ప్రభాతవార్త:**

శ్రీకాళహస్తీశ్వరాలయంలో నిర్వహిస్తున్న నిత్యాన్నదాన పథకానికి భక్తుల నుంచి భూరి విరాళాలు అందుతున్నాయి. ఈ నేపథ్యంలో బుధవారం హైదరబాద్ వాస్తవ్యులు వినకోట. విరూపాక్షరావు ఒక లక్ష రూపాయలు కుటుంబ సభ్యులతో కలిసి అందించారు. ఈ సందర్భంగా దేవస్థానం ఏఇఓ లోకేష్‌బాబు వారి కుటుంబ సభ్యులకు శ్రీజ్ఞానప్రసూనాంబ శ్రీకాళహస్తీశ్వరుని ప్రత్యేక దర్శనం కల్పించి వేదపండితుల ఆశీర్వచనం కల్పించారు. అనంతరం వారికి తీర్థ ప్రసాదాలను అందించారు. కార్యక్రమంలో ఆలయ సిబ్బంది నాగయ్య, పిఆర్‌ఓ రవి తదితరులు పాల్గొన్నారు.

## రాబోవు ఎన్నికల్లో...విజయమే లక్ష్యంగా పని చేయండి



**శ్రీకాళహస్తి, ఆగస్టు 26 ప్రభాతవార్త:**

నియోజకవర్గ సమగ్రాభివృద్ధికి, భవిష్యత్ కార్యాచరణ మరియు త్వరలో రాబోతున్న స్థానిక సంస్థల ఎన్నికల్లో కూటమి పార్టీ విజయమే లక్ష్యంగా శ్రీకాళహస్తి శాసనసభ్యులు బొజ్జల వెంకట సుధీర్‌రెడ్డి కార్యాకర్తలతో, నాయకులతో సుధీర్ఘంగా చర్చించారు. కార్యక్రమానికి ముఖ్యఅతిధిగా పార్లమెంట్ అధ్యక్షురాలు పనబాక లక్ష్మి హాజరయ్యారు. ఈ సందర్భంగా కార్యకర్తలను ఉద్దేశించి ఆయన మాట్లాడుతూ రాబోవు స్థానిక సంస్థల ఎన్నికల్లో పార్టీని క్షేత్రస్థాయి నుంచి మరింత బలోపేతం చేసే దిశగా దిశానిర్దేశం చేశారు. ప్రతి పంచాయతీ, వార్డు స్థాయిలో నాయకులు కార్యకర్తలు ఏకతాటిపైకొచ్చి ప్రజలకు అండగా నిలవాలని పిలుపునిచ్చారు. ఈ సందర్భంగా పార్లమెంట్ అధ్యక్షురాలు పనబాక లక్ష్మి మాట్లాడుతూ తిరుపతి జిల్లా వ్యాప్తంగా కూటమి నాయకులు సమన్వయంతో పని చేస్తూ స్థానిక సంస్థల ఎన్నికల్లో పూర్తి స్థాయిలో మెజార్టీ చేయడమే ధ్యేయంగా ముందుకు సాగాలని సూచించారు. శాసనసభ్యులు నాయకత్వంలో శ్రీకాళహస్తి నియోజకవర్గం అభివృద్ధి పథంలో దూసుకెళ్తుందన్నారు. నియోజకవర్గాన్ని జిల్లాలో ఆదర్శంగా తీర్చిదిద్దడానికి ప్రజాప్రతినిధులు, నాయకులు కలిసి కృషి చేయాలని ఆదేశించారు. కార్యక్రమంలో సత్యవేడు నియోజవర్గ పరిశీలకులు కూరపాటి శంకర్‌రెడ్డి, మాజీ మార్కెంటింగ్ కమిటీ ఛైర్మన్ రంగినేని చెంచయ్యనాయుడు, పార్టీ నాయకులు, కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

## నియోజకవర్గ అభివృద్ధికి సహకరించండి



**శ్రీకాళహస్తి, ఆగస్టు 26 ప్రభాతవార్త:**

శ్రీకాళహస్తి నియోజకవర్గ అభివృద్ధికి సహకరించాలని బుధవారం జిల్లా కలెక్టర్ కార్యాలయంలో జిల్లా కలెక్టర్ వెంకటేశ్వర్‌ను శ్రీకాళహస్తి నియోజకవర్గ శాసనసభ్యులు బొజ్జల వెంకట సుధీర్‌రెడ్డి కోరారు. ఈ సందర్భంగా నియోజకవర్గ అభివృద్ధినే లక్ష్యంగా పలు ప్రజా సమస్యలు, మౌళిక వసతుల కల్పనపై జిల్లా కలెక్టర్‌తో సుధీర్ఘంగా చర్చించారు. నియోజకవర్గంలో ప్రజా సంక్షేమం, పెండింగ్ పనులను వేగవంతం చేయాలని, అందుకు పూర్తిగా సహకరించాలని జిల్లా కలెక్టర్‌ను కోరారు. అలాగే నియోజకవర్గంలో జరుగుతున్న పలు అభివృద్ధి కార్యక్రమాలకు సహకరించాలని కోరారు. అనంతరం శ్రీకాళహస్తీశ్వర స్వామివారి చిత్రపటాన్ని, తీర్థప్రసాదాలను అందించారు.

## పరశురామేశ్వరుని సేవలో ప్రముఖులు



**ఏర్పేడు, ఆగస్టు 26 ప్రభాతవార్త:**

మండలంలోని గుడిమల్లం గ్రామంలో వెలసిన ఆనందవల్లి సమేత పరశురామేశ్వరుని ఆలయంలో బుధవారం సూపరింటెండెంట్ ఇంజనీరు, రోడ్డు భవనాల శాఖ, చిత్తూరు జిల్లా సురేష్‌బాబు దర్శనానికి వచ్చేరు. వారికి ఆలయ ఛైర్మన్ బత్తల గిరిబాబునాయుడు, కార్యనిర్వహణాధికారి మునిశేఖర్, ప్రధాన ద్వారం వద్దస్వాగతం పలికి దర్శన ఏర్పాట్లు చేశారు. వారికి వేదపండితులు ప్రత్యేక ఆశీర్వచనాలు అంద జేశారు.

## రక్తదానం...ప్రాణదానంతో సమానం

**శ్రీకాళహస్తి, ఆగస్టు 26 ప్రభాతవార్త:**




శ్రీకాళహస్తి ఎంజీఎం గ్రూప్ అధినేత గుడ్లూరు మల్లికార్జున నాయుడు జన్మదిన వేడుకలు బుధవారం ఘనంగా జరిగాయి. ఇండియన్ రెడ్ క్రాస్ సొసైటీ,ఎంజీఎం గ్రూప్ సంయుక్త ఆధ్వర్యంలో హాస్పిటల్‌లో మెగా రక్తదాన శిబిరం నిర్వహించారు. ఈ శిబిరంలో 103 మంది రక్తదానం చేశారు. ఈ సందర్భంగా ఎంజీఎం డైరెక్టర్ గుడ్లూరు ఐశ్వర్య మాట్లాడుతూ చైర్మన్ మల్లికార్జున నాయుడు సూచనలతో సేవా కార్యక్రమాలు చేపడుతున్నామని తెలిపారు. జన్మదినాన్ని పురస్కరించుకుని హాస్పిటల్‌లో ఉచిత ఓపీ సేవలు అందించామని, రూ.2500 విలువైన బిఎండి ఎముక పటుత్వ పరీక్షను ఉచితంగా నిర్వహించామని, దాదాపు 250మంది ఈ సేవను సద్వినియోగం చేసుకున్నారని పేర్కొన్నారు. కార్యక్రమంలో రెడ్ క్రాస్ సొసైటీ చైర్మన్ డాక్టర్ శ్రీహరి, వైస్ చైర్మన్, గ్రూప్ డైరెక్టర్ డాక్టర్ గుడ్లూరు మయూర్, రెడ్ క్రాస్ సిబ్బంది, సభ్యులు పాల్గొన్నారు.

# అధికార పార్టీలో ఉత్కంఠత

## - ప్రతిపక్షంలో నిర్లత్తపత- స్థానిక సంస్థల పోరు




శ్రీకాళహస్తిరూరల్, ఆగస్టు 26 ప్రభాతవార్త : శ్రీకాళహస్తి నియోజకవర్గంలో స్థానిక సంస్థల పోరుపై అధికార పార్టీలో ఉత్కంఠత నెలకొనగా, ప్రతిపక్షంలో నిరాసక్తత చోటు చేసుకుంది. నీవు నేర్పిన విద్యే నీరజాక్ష అన్నట్లు గతంలో వైకాపా పాలనలో నామినేషన్లు కూడా వేయకుండా అడ్డుకున్న సంఘటనలు ఆ పార్టీ నాయకులు నెమరేసు కుంటున్నారు. గతంలో వైకాపా అధికారంలో వున్నప్పుడు జెడ్పిటిసి, ఎంపిటిసి సర్పంచ్ ఎన్నికలు జరిగాయి. ఈ ఎన్నికలకు సంబంధించి అప్పటి పాలకులు నామినేషన్లు వేయనీయకుండా అధికారులను తమ ఆధీనంలో వుంచుకున్నారు. అంతేకాక పదవులను ఓపెన్ మార్కెట్‌లో వేలం వేసినట్లు అమ్ముకున్నారనే ఆరోపణలు మిన్నుముట్టాయి. నాడు నామినేషన్ వేయకుండా అడ్డుకోవడమే కాక వేసిన నామినేషన్‌ను కూడా అప్పటి అధికారులు చించి వేశారు. ప్రస్తుత తెలుగుదేశం పార్టీ మండలాధ్యక్షులు నాడు నామినేషన్ వేయడానికి వెళ్తే అడ్డుకొని చించివేసినట్లు ఆరోపణలు వున్నాయి. ఈ నేపథ్యంలో ఏడాది అక్టోబర్, నవంబర్‌లో జరిగే స్థానిక సంస్థల ఎన్నికల్లో తెలుగుదేశం ఎలా వ్యవహరిస్తుంది? అనే అంశంపై వైకాపాలో సందేహాలు వ్యక్తమౌతున్నాయి. అయితే తెలుగుదేశంలో మాత్రం ఆశల పల్లకిలో విహరిస్తున్నారు. దీర్ఘకాలంగా పార్టీనే నమ్ముకున్న మాజీ మండల పార్టీ అధ్యక్షులు కామేష్‌యాదవ్, జెడ్పిటిసి పదవిపై ఆశలు పెంచుకున్నారు. ఇక మండలాధ్యక్షులుగా ఎంతో రాజకీయ అనుభవస్తున్న తాటిపర్తి కుటుంబానికి చెందిన యువ నాయకుడు రవీంద్రరెడ్డి పేరు వినబడుతోంది. ఈ కుటుంబానికి చెందిన తాటిపర్తి ఈశ్వర్‌రెడ్డికి మార్కెటింగ్ కమిటి పదవి వస్తుందని ఆశించారు. కానీ పలు సమీకరణలతో ఆ అవకాశం దక్కలేదు. దాంతో ఈ సారి మండలాధ్యక్ష పదవి అయినా సాధించాలని భావిస్తున్నారు. ఇక మరో మేజర్ మండలం ఏర్పేడులో తెలుగుదేశం పార్టీ పదవుల కోసం మండల పార్టీ అధ్యక్షులు పేరం నాగరాజనాయుడు, మాజీ అధ్యక్షులు పొన్నారావులు రేస్‌లో వున్నట్లు తెలిసింది. వివిధ సమీరణలతో ఒకరు జెడ్పిటిసి మరొకరు మండలా ధ్యక్షులుగా సర్దుకోగా తప్పదు. ఇక ప్రతిపక్ష వైకాపా పరిస్థితి పరిశీలిస్తే అగమ్య గోచరంగా వున్నదని పరిశీలకులు వ్యాఖ్యానిస్తున్నారు. అధికార తెలుగుదేశం పార్టీకి ఢీ కొనేందుకు ఆలోచిస్తున్నారు. శ్రీకాళహస్తి మండలంలో చెవిరెడ్డి మధుసూదన్‌రెడ్డి, బర్రె సుదర్శన్‌రెడ్డి, శ్రీనివాసులురెడ్డి, చెంచయ్యనాయుడు పేర్లు వినిపిస్తున్నాయి. అయితే వారు కూడా అధికార పార్టీని ఢీకొంటారా ? లేదా? అని వేచి చూడాలి. ఎన్నికలకు సంబంధించి ప్రచారం జోరుగా సాగుతున్నా స్థానిక వైకాపా నాయకుడు మాత్రం అనుచరులతో ఇప్పటి వరకు ఎలాంటి చర్చ గానీ, ప్రస్తావన కానీ జరపలేదని కార్యకర్తలు అంటున్నారు. ఇలా ప్రతిపక్ష పార్టీ నిరాశ, నిర్లిప్తతతో కొట్టుమిట్టాడుతున్నారు.

### బ్రహ్మోత్సవాలు వస్తున్నా...

# ఈ రోడ్డు బాగు చేయరా?





కాణిపాకం, ఆగస్టు 26 ప్రభాతవార్త: ప్రముఖ పుణ్యక్షేత్రమైన కాణిపాకం శ్రీవరసిద్ధి వినాయకస్వామి వారి దేవస్థానంలో స్వామివారి బ్రహ్మోత్స వాల గడువు దగ్గర పడుతున్నా ఆలయానికి కూత వేటు దూరంలో వున్న గుంతల మయమైన కాణిపాకం-ఉత్తర బ్రాహ్మణపల్లె రోడ్డు మరమ్మతులు గురించి అధికారులు పట్టించుకోకపోవడంతో ప్రయాణీకులు నిరసన వ్యక్తం చేస్తున్నారు. కాణిపాకం దేవస్థానంలో వచ్చేనెల 14 నుండి స్వామివారి బ్రహ్మోత్స వాలు అంగరంగ వైభవంగా జరుగనున్నాయి. ఈమేరకు బ్రహ్మోత్స వాల విజయవంతంకు జిల్లా కలెక్టర్ ఆధ్వర్యంలో భారీ ఏర్పాట్లును చేస్తోంది. ఇందులో భాగంగా ప్రయాణీకుల సౌకర్యార్థం వివిధ ప్రాంతాల నుండి కాణిపాకం వచ్చే రోడ్లును యుద్ధ ప్రాతిపదికన మరమ్మత్తులు చేపట్టి పూర్తి చేయాలని జిల్లా కలెక్టర్ ఆదేశించారు. అయితే కాణిపాకం ఆనుకునే వున్న కాణిపాకం-ఉత్తర బ్రాహ్మణలపల్లె రోడ్డు గురించి అధికారులు పట్టించుకోకపోవడంపై పరిసర గ్రామాల ప్రజలు, ప్రయాణీకులు తీవ్ర నిరసన వ్యక్త చేస్తున్నారు. సుమారు 10 సంవత్స రాల క్రితం నిర్మించిన ఈబిటీ రోడ్డు గుంతలమయమై వాహనాల రాకపోకలకు తీవ్ర ఇబ్బందికరంగా తయారైంది. బెంగుళూరు, పలమనేరు తదతర ప్రాంతాల నుండి ప్రతి రోజూ ఆమార్గం గుండా వందలాది వాహనాల్లో భక్తులు కాణిపాకం వరకు రాకపోకలు సాగిస్తుంటారు. అయితే గుంతలమయమైన ఈరోడ్డు గురించి అధికారులు పట్టించుకోకపోవడంతో భక్తులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. ఇప్పటికైనా అధికారుల స్పందించి గుంతలమయమైన కాణిపాకం- ఉత్తరబ్రాహ్మణ పల్లె రోడ్డును బ్రహ్మోత్స వాలలోగా మరమ్మతులు చేయాలని ప్రయాణీకులు, భక్తులు కోరుతున్నారు.

# యువత క్రీడల్లో రాణించేందుకు ప్రోత్సాహం అవసరం

### -రాష్ట్ర స్థాయి పోటీలలో పాల్గొన్న టిటిడి బోర్డు చైర్మన్ బిఆర్ నాయుడు





తిరుపతి క్రీడ, ఆగస్టు 26 ప్రభాతవార్త: తిరుపతిలో నిర్వహిస్తున్న అమరావతి ఛాంపియన్‌షిప్ రాష్ట్రస్థాయి వాలీబాల్ కబడ్డీ పోటీలను టీటీడీ బోర్డు చైర్మన్ బి.ఆర్. నాయుడుకి వీక్షించడానికి హాజరైయ్యారు. తిరుపతి టిడిపి నియోజకవర్గ ఇంచార్జ్ జేబీ శ్రీనివాసులుతో కలిసి శాప్‌చైర్మన్ రవి నాయుడు ఆయనకు స్వాగతం పలికారు. అనంతరం, ఎస్‌వీ క్యాంపస్ స్కూల్‌లో అనకాపల్లి, మన్యం జిల్లాల మధ్య జరిగిన సెమీఫైనల్ అండర్23 పురుషుల వాలీబాల్, శ్రీనివాస స్పోర్ట్స్ కాంప్లెక్స్‌లో జరుగుతున్న అండర్ 23 బాపట్ల జిల్లా వర్సస్ కృష్ణా జిల్లా, మన్యం జిల్లా వర్సస్ కడప జిల్లా కబడ్డీ పోటీలను వారు సందర్శించి క్రీడాకారులను పరిచయం చేసుకుని, పోటీలను ప్రారంభించారు. ఈ సందర్భంగా టీటీడీ బోర్డు చైర్మన్ బి.ఆర్. నాయుడు మాట్లాడుతూ అమరావతి ఛాంపియన్‌షిప్‌లో పాల్గొంటున్న క్రీడాకారులందరికీ అభినందనలు తెలిపారు. అన్ని క్రీడా పోటీలు విజయవంతంగా సాగాలని, క్రీడాకారులు మరింత ఉన్నత స్థాయికి ఎదగాలని శ్రీవారిని ప్రార్థిస్తున్నట్లు చెప్పారు. యువత క్రీడల్లో రాణించేందుకు అవసరమైన ప్రోత్సాహం అందించాల్సిన అవసరం ఉందన్నారు. రవి నాయుడు మాట్లాడుతూ అమరావతి ఛాంపియన్‌షిప్ మూడో రోజు టీటీడీ చైర్మన్ బి.ఆర్. నాయుడు హాజరై క్రీడాకారులను ప్రోత్సహించడం తమకు ఎంతో గర్వకారణమని అన్నారు. టీటీడీ తరఫున క్రీడలకు అందుతున్న ప్రోత్సాహం అభినందనీయమని పేర్కొన్నారు. క్రీడలను ప్రోత్సహించే వ్యక్తిగా బి.ఆర్. నాయుడు క్రీడాకారులకు అందిస్తున్న ప్రోత్సాహం అభినందనీయమని రవి నాయుడు పేర్కొన్నారు.

# సన్మానం చేయడం అభినందనీయం

## - రుయా సూపరింటెండెంట్ డాక్టర్ బాదూరు మనోహర్



తిరుపతి హెల్త్, ఆగస్టు 26 ప్రభాతవార్త: ఒక జర్నలిస్టుగా ఉంటూ తన కన్నా ముందు వారైన సీనియర్లను, అలాగే కలలపై మక్కువతో కళాకారులను సన్మానించడం అన్నది అభినందనీయం అంటూ రుయా హాస్పిటల్ సూపరిన్‌టెండెంట్, ప్రొఫెసర్ డాక్టర్ మనోహర్ కొనియాడారు. బుధవారం తిరుపతి ప్రెస్ క్లబ్ లో ప్రజా కళావేదిక ఏర్పాటు చేసిన ప్రత్యేక సన్మానం కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన ఆయన మాట్లాడుతూ నేడు సమాజంలో ఎంతో సంపాదించుకున్నాం అనే ఆలోచనతోనే చాలా మంది ఆలోచన చేయడం జరుగుతున్నదని అలా కాకుండా తాను సంపాదించిన కొంతలో ఇలాంటి సేవా కార్యక్రమాలకు ఖర్చు చేయడం అనేది అందరికీ కాదని అన్నారు. ఇలాంటి కార్యక్రమాలు నిర్వహించడం ద్వారా ఎంతైనా అభినందనీయమని ఆయన కొనియాడారు. ఇదే కార్యక్రమానికి గౌరవ అతిథిగా పాల్గొన్న పాలిటెక్నికల్ విశ్రాంత లెక్చరర్ కాపిరెడ్డి కృష్ణారెడ్డి మాట్లాడుతూ జైపాల్ తాను చదువుకునే కాలేజీలోనే నేను లెక్చరర్‌గా ఉండటం ఇలాంటి మంచి కార్యక్రమాలకి నన్ను ఆహ్వానించడం గురువు శిష్యుల బంధమైన మా ఇద్దరి బంధంతో నన్ను గుర్తుంచుకొని పిలవడం నా గురించి ఘనంగా చెప్పుకోవటం చాలా ఆనందంగాను, గర్వంగా ఉందని ఆయన అన్నారు. అలాగే ఇలాంటి మంచి కార్యక్రమాలను చేసే ఆలోచన రావడం ఆనందంగా ఉందన్నారు. మరో అతిథి రుయా హాస్పిటల్ ప్రొఫెసర్, సర్జన్ డాక్టర్ రోజా రమణి మాట్లాడుతూ గతంలో కూడా జైపాల్ చేసిన కొన్ని కార్యక్రమాల్లో నేను పాల్గొనడం జరిగిందని చాలా మంచి కార్యక్రమాలతో ప్రోత్సాహం అందిం చడం జరుగుతుంది ఆమె కొనియాడారు. ఈ కార్యక్రమానికి వ్యాఖ్యాతగా ఉన్న విద్యావేత్త, కవి రచయిత రిటైర్డ్ ప్రిన్సిపల్ అయిన నారాయణ స్వామి మాట్లాడుతూ ప్రజా కళావేదిక వ్యవస్థాపకులైన జైపాల్ మన పల్లె జానపదం అనే కార్యక్రమంతో ముఖ్యంగా మరుగున పడిన పల్లె జానపదం పాటలతో పలువురికి స్టేజిపై పాడే అవకాశాన్ని ఇచ్చి పరిచయం చేసినటువంటి ఘనత ఆయనకే దక్కుతుంది అని ఈ సందర్భంగా గుర్తు చేశారు. సన్మాన గ్రహీతలకు మేమేంటో, శాలువ, సర్టిఫికెట్ తో ఘనంగా సన్మానించడం జరిగింది. ఇదే కార్యక్రమంలో జానపదం గాయని కృష్ణకుమారి చక్కటి పల్లె పాటలతో ఆలరించారు. మరో గాయకులు కవి రచయిత సన్మాన గ్రహీత వెంకటేశ్వర్లు సైతం చక్కటి జానపదతో అందరిని అలరించారు. ఈ కార్యక్రమంలో ప్రజా కళావేదిక మహిళా అధ్యక్షురాలు రాళ్లపల్లి రజిని, ప్రధాన కార్యదర్శి రుక్మిణి రెడ్డి, ప్రత్యేక ఆహ్వానితులుగా కవిత్రిని, రచయిత్రి కరణం విమల, జగదీష్‌లు తదితరులు పాల్గొన్నారు.

### గణేశ దీక్షకు అన్నీ ఉచితం



తిరుపతి హెల్త్, ఆగస్టు 26 ప్రభాతవార్త: అఖిల భారత గణేష్ సేవాదళ్ ఆంధ్రప్రదేశ్ రాష్ట్రశాఖ ఆధ్వర్యంలో వ్యవస్థాపక అధ్యక్షులు మురంశెట్టి రాములు సూచనలతో కార్యదర్శి స్వయంభు శ్రీ కాణిపాకం వరసిద్ధి వినాయక స్వామి దీక్ష గోడ పత్రికను విడుదల చేసి, వినాయక చవితికి ప్రతి ఒక్కరూ కనీస మాల ధరిస్తే, కావలసిన సామాగ్రిని ఉచితంగా అందజేస్తామని అఖిల భారత గణేష్ సేవాదళ్ సభ్యులు అన్నారు. బుధవారం తిరుపతి ప్రెస్‌క్లబ్‌లో జరిగిన విలేకరుల సమావేశంలో వారు మాట్లాడారు. శ్రీమహాగణపతి పీఠము హరిహర నివాస్, ద్వారకా నగర్,తిరుపతి నందు మాలధారణ చేసుకోవచ్చని, దీక్షా స్వాములకు అల్పాహారం భోజనం మరియు వసతి సదుపాయాలు ఆర్యవైశ్య బ్రాహ్మణ చౌట్రీ, కేటి రోడ్డు,తిరుపతి నందు ఏర్పాటు చేశామని అన్నారు. ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర అధ్యక్షులు కర్రే శ్రీనివాసులు మాట్లాడుతూ పీఠము, వసతి భిక్ష ఏర్పాటు చేయడమైనదని ఆసక్తి ఉన్న వారు తమను సంప్రదించగలరని, వినాయక చవితిన మట్టి గణపతిని ఏర్పాటు చేసి, అవసరమైన వారికి అందజేస్తామని కూడా తెలియజేశారు.కార్యదర్శి విజయ్ రాజకుమార్ మాట్లాడుతూ భక్తులకు, స్వాములకు అన్నదానం, వస్త్రములు ఏర్పాటుకై కృషి చేస్తామని పెద్ద ఎత్తున భక్తులు స్వామి మాలలను స్వీకరించాలని తెలియజేశారు. గోపి గురుస్వామి మాట్లాడుతూ అర్ధమండల దీక్ష, మండల దీక్ష ఏకాదశ దీక్ష, మాల ధారణ చేసి ప్రతి ఒక్కరూ ఫలాన్ని పొందాలని కోరారు. ఈ కార్యక్రమంలో డాక్టర్ ఎం తేజ, యశస్వి, గుప్తా, గణేశ స్వామి జాతీయ ప్రధాన కార్యదర్శి మాట్లాడుతూ 2005వ సంవత్స రంలో మొట్ట మొదటిగా మొరం శెట్టి రాములు కాణిపాకం నందు దీక్షణ ప్రారంభించి హోమం వంటి కార్యక్రమాలు ప్రథమంగా వారి చేతనే అందరి సహాయ సహకారాలతో ప్రారంభించబడ్డాయని, అందరం కలిసి మహాగణపతిని పూజిద్దామని తెలియజేశారు. ఈ కార్యక్రమంలో పురోహితులు శశి మౌలి, విజయ్ చంద్రుడు, సురేష్ తదితరులు పాల్గొన్నారు.

### శ్రీవారి పాదాల చెంత పనిచేయడం... పూర్వజన్మ సుకృతం: డాక్టర్ ఆర్వీ కుమార్



తిరుపతి హెల్త్, ఆగస్టు 26 ప్రభాతవార్త: కలియుగ ప్రత్యక్ష దైవం శ్రీ వెంకటేశ్వర స్వామి వారి పాదాల చెంత మూడు సంవత్సరాల పాటు స్విమ్స్ సంచాలకులు మరియు ఉపకులపతిగా సంతృప్తికరంగా సేవలు అందించానని, ఈ అవకాశాన్ని పూర్వజన్మ సుకృతంగా భావిస్తున్నానని డాక్టర్ ఆర్.వి. కుమార్ పేర్కొన్నారు. స్విమ్స్ ఓపిడి బ్లాక్‌లోని శ్రీ పద్మావతి ఆడిటోరియంలో బుధవారం సాయంత్రం డాక్టర్ ఆర్.వి. కుమార్ వీడ్కోలు సందర్భంగా ఘనంగా సన్మాన కార్యక్రమం నిర్వహించినట్లు మెడికల్ సూపరింటెండెంట్ డాక్టర్ రామ్ తెలిపారు ఈ సందర్భంగా డాక్టర్ ఆర్వీ కుమార్ మాట్లాడుతూ తన హయాంలో స్విమ్స్ అభివృద్ధి కోసం టిటిడి నుండే వచ్చే ఆర్థిక సహాయం 130 కోట్లకు పెరిగిందని తెలిపారు. రోగులకు మెరుగైన వైద్య సేవలు అందించేందుకు ఇటీవల ఫ్యాకల్టీ రిక్రూట్మెంట్ ప్రక్రియను విజయవంతంగా పూర్తి చేసినట్లు వెల్లడించారు. అదేవిధంగా మెడికల్, పారామెడికల్, అడ్మినిస్ట్రేషన్ పోస్టుల భర్తీ కోసం నియామక ప్రక్రియ ప్రస్తుతం జరుగుతోందని, ఈ నియామకాలు పూర్తి అయితే సంస్థ ఎదుగుదలకు ఎంతగానో తోడ్పాటు కలుగుతుందని చెప్పారు. రోగులకు సహాయకారిగా స్విమ్స్ సేవ పేరుతో స్వచ్ఛంద సేవను ప్రారంభించామని, అదేవిధంగా నిపుణులైన డాక్టర్లు వైద్య సేవలు అందించేందుకు వీలుగా టిటిడి ఆధ్వర్యంలో శ్రీవారి వైద్య సేవ విజయవంతంగా నడుస్తోందని తెలియజేశారు. వైద్యులు, నర్సులు ఇతర సిబ్బంది మరింత అంకిత భావంతో పనిచేసి అందరూ గర్వపడేలా సంస్థను అభివృద్ధి చేయాలని ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో సిమ్స్ డీన్ డాక్టర్ అలోక్ సచన్, రిజిస్ట్రార్ డాక్టర్ అపర్ణ బిట్ల, మెడికల్ సూపరింటెండెంట్ డాక్టర్ రామ్, నెఫ్రాలజి సీనియర్ ప్రొఫెసర్ డాక్టర్ శివకుమార్, న్యూరో సర్జరీ సీనియర్ ప్రొఫెసర్ డాక్టర్ బిసిఎం ప్రసాద్, కంట్రోలర్ ఆఫ్ ఎగ్జామినేషన్స్ డాక్టర్ శిల్ప కడియాల, కార్డియాలజీ విభాగాధిపతి డాక్టర్ వనజాక్షమ్మ, శ్రీ పద్మావతి మహిళా వైద్య కళాశాల వైస్ ప్రిన్సిపాల్లు డాక్టర్ శర్వాణి, డాక్టర్ విజయలక్ష్మి, పలు విభాగాల అధిపతులు, డాక్టర్లు, వైద్య సిబ్బంది తదితరులు పాల్గొని ప్రసంగించారు.

## తూర్పుపల్లెల్లో రోడ్ల సమస్యకు... త్వరలోనే శాశ్వత పరిష్కారం

### - ఎమ్మెల్యే నెలవల విజయశ్రీ



సూళ్లూరుపేట, ఆగస్టు 26 ప్రభాతవార్త: తూర్పు పల్లెలుగా పిలవబడే తీర ప్రాంత గ్రామాలకు సమస్యగా ఉన్న తారు రోడ్డు నిర్మాణానికి త్వరలోనే శాశ్వత పరిష్కారాన్ని ఏర్పాటు చేయనట్లు స్థానిక ఎమ్మెల్యే నెలవల విజయశ్రీ వెల్లడించారు. బుధవారం ఆమె 67లక్షల రూపాయలతో చేపట్టనున్న అటకాని తిప్ప, పేర్నాడు గ్రావెల్ రోడ్డు పనులకు భూమి పూజ చేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ తూర్పు పల్లెలలో ప్రజలు ఎదుర్కొంటున్న ఇబ్బందులను దృష్టిలో ఉంచుకొని తాత్కాలికంగా ఈ రోడ్డు పనులను చేపడుతున్నట్లు చెప్పారు. ఎన్నో సంవత్సరాలుగా ఈ ప్రాంత గ్రామాల ప్రజలకు తీరని సమస్యగా ఉన్న రోడ్డు నిర్మాణాన్ని శాశ్వత ప్రాతిపదికన చేపట్టేందుకు కృషి చేస్తున్నట్లు తెలిపారు. ఇందులో భాగంగా ఆర్ అండ్ బి సేకరించి అటవీ శాఖకు డిజిపిఎస్ సర్వే కోసం ఫైల్ను పంపించడం జరిగిందని వివరించారు. సర్వే ప్రక్రియ పూర్తయిన అనంతరం పర్వవేష్ పోర్టల్ ద్వారా అవసరమైన అటవీ శాఖ అనుమతుల కోసం ప్రయత్నం చేసి ఈ రహదారికి శాశ్వత పరిష్కార మార్గాన్ని చూపుతామని ఎమ్మెల్యే నెలవల విజయశ్రీ చెప్పారు.గ్రామీణ ప్రాంతాలలో రహదారికి అనుసంధాన మార్గాలను మెరుగుపరచడం, ప్రజలకుఅవసరమైన మౌలిక వసతులను కల్పించడం కూటమి ప్రభుత్వ ప్రధాన లక్ష్యమని ఆమె తెలిపారు. ఈ కార్యక్రమంలో టిడిపి నేతలు పాకం వెంకట సుబ్బయ్య, సుధాకర్‌రెడ్డి, కొక్కు శంకరయ్య, గొంజి వెంకటేశ్వర్లు తదితరులు పాల్గొన్నారు.

### వెంకయ్య మృతి సంతాపం తెలిపిన ఎమ్మెల్యే



బాలాయపల్లి, ఆగస్టు 26 ప్రభాతవార్త : మండలంలోని వెంగమాంబరం గ్రామానికి చెందిన మాజీ సర్పంచ్ సాధనాల వెంకయ్య నాయుడు అనారోగ్యంతో మృతి చెందారు. వెంకయ్య నాయుడు సర్పంచ్‌గా, సాగునీటి సంఘం డైరెక్టర్గా పనిచేశారు. మాజీ సర్పంచి వెంకయ్య నాయుడు మృతికి ఎమ్మెల్యే కురుగొండ్ల రామకృష్ణ సంతాపం తెలిపారు. ఆయన మృతి తీరని లోటు అని ఎమ్మెల్యే రామకృష్ణ తెలిపారు. కుటుంబ సభ్యులకు సానుభూతి వ్యక్తం చేశారు. మాజీ సర్పంచ్ వెంకయ్య నాయుడు మృతికి మండల టిడిపి అధ్యక్షుడు రాయి సత్యం నాయుడు, మాజీ ఏఎంసీ చైర్మన్ సీసీ నాయుడు తదితరులు సంతాపం తెలిపారు.

### మోడల్ అంగన్వాడి కేంద్రం ప్రారంభం



తడ, ఆగస్టు 26 ప్రభాతవార్త : సెయింట్ గోబెన్ సంస్థ సహకారంతో 34 లక్షల వ్యయంతో నిర్మించిన మోడల్ అంగన్వాడి కేంద్రాన్ని ఎమ్మెల్యే నెలవల విజయశ్రీ ప్రారంభించారు. తడ మండలం పూడి కుప్పం గ్రామంలో సెయింట్ గోబెన్ సంస్థ సిఎస్ఆర్ నిధులు 34 లక్షల వెచ్చించి నూతన హంగులతో అత్యాధునిక సౌకర్యాలతో మోడల్ అంగన్వాడి భవనాన్ని నిర్మించారు. బుధవారం ఎమ్మెల్యే చేతుల మీదుగా ప్రారంభించారు. అదేవిధంగా సెయింట్ గోబెన్ సంస్థ పూడి కుప్పం గ్రామానికి 9సోలార్ లైట్లను ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ సెయింట్ గోబెన్ సంస్థ చేస్తున్న అభివృద్ధి కార్యక్రమాలను అభినందించారు. రాష్ట్ర ప్రభుత్వం చేస్తున్న అభివృద్ధి కార్యక్రమాలతో పాటు పరిశ్రమలు సామాజిక బాధ్యతలో భాగంగా అభివృద్ధికి సహకరిస్తే గ్రామాలలో మరిన్ని మెరుగైన సౌకర్యాలు ఏర్పాటు చేయవచ్చునని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో మండల టిడిపి పార్టీ అధ్యక్షులు సెల్వం, తడ సొసైటీ చైర్మన్ వేనాటి శ్రీకాంత్ రెడ్డి, బొమ్మన్ పళని, ఎంపీడీవో శేఖర్ నాయక్, సిడిపిఓ జ్యోతి కిరణ్ అంగన్వాడి సిబ్బంది ప్రభుత్వ అధికారులు పాల్గొన్నారు.

### భక్తి శ్రద్ధలతో పవిత్రాల సమర్పణ



శ్రీకాళహస్తిరూరల్, ఆగస్టు 26 ప్రభాతవార్త: శ్రీకాళహస్తి మండలం తొండమాన్ పురంలో వెలసిన శ్రీదేవి, భూదేవి సమేత వెంకటేశ్వరస్వామి ఆలయంలో జరుగుతున్న పవిత్రోత్స వాల్లో భాగంగా బుధవారం స్వామి వారికి పవిత్రాల సమర్పణ కార్యక్రమానికి చుట్టుపక్కల గ్రామాలకు చెందిన భక్తులు,పట్టణానికి చెందిన భక్తులు భక్తి శ్రద్ధలతో నిర్వహించారు. తిరుమల వెళ్ళలేని భక్తులు ప్రసన్న వరదరాజస్వామి ఆలయంలో స్వామివారి సేవల్లో తరిస్తున్నారు. బుధవారం ఉదయం నుంచి ఆలయంలో సంప్రదాయబద్ధంగా కార్యక్రమాలను వేదపండి తులు నిర్వహించారు. ఆలయంలో జరిగే తప్పిదాల నివృత్తికి పవిత్రోత్స వాలు నిర్వహించటం ఆనవాయితి. ఏడాదిలో నాలుగు రోజుల పాటు నిర్వహించటం ఆనవాయితి. ఈ నేపధ్యంలో బుధవారం జరిగిన క్యాక్రమాల్లో సూపరింటెండెంట్ జ్ఞానప్రకాష్, టెంపుల్ ఇన్స్పెక్టర్ సుధీర్, ప్రధానార్చకులు రమణస్వామి, కృష్ణస్వామి, గోపిస్వామి, బాబుస్వామి గ్రామానికి చెందిన ఆధ్యాత్మిక వాది కందాటి శేఖర్‌రెడ్డి హాజరయ్యారు. పవిత్రోత్స వాల సందర్భంగా ఆలయాన్ని శోభాయమానంగా తీర్చి దిద్దారు.

### అమరావతి ఛాంపియన్‌షిప్ - ఆర్చరీ రాష్ట్రస్థాయి పోటీలు



తిరుపతి హెల్త్, ఆగస్టు 26 ప్రభాతవార్త: అమరావతి ఛాంపియన్‌షిప్ రాష్ట్రస్థాయి పోటీల్లో భాగంగా శ్రీ వెంకటేశ్వర క్యాంపస్ స్కూల్‌లో నిర్వహిస్తున్న ఆర్చరీ రాష్ట్రస్థాయి పోటీలను శాప్ చైర్మన్ రవి నాయుడు సందర్శించారు. ఈ సందర్భంగా పోటీల్లో పాల్గొంటున్న క్రీడాకారులతో ఆయన ముచ్చటించి, వారి శిక్షణ, క్రీడా ప్రస్థానం, లక్ష్యాలను అడిగి తెలుసుకున్నారు. అనంతరం ఆర్చరీ పోటీలను ప్రత్యక్షంగా వీక్షించి, క్రీడాకారుల ప్రతిభను అభినందించారు. అలాగే ఇటీవల కర్నూల్లో జరిగిన సీబీఎస్‌ఈ జోన్-1 ఆర్చరీ పోటీల్లో పతకాలు సాధించిన ఆంధ్రప్రదేశ్ క్రీడాకారులను శాప్ చైర్మన్ రవి నాయుడు ప్రత్యేకంగా అభినందించారు. భవిష్యత్తులో మరిన్ని విజయాలు సాధించి రాష్ట్రానికి, దేశానికి మంచి పేరు తీసుకురావాలని ఆకాంక్షించారు.

**- అమరావతి ఛాంపియన్‌షిప్ ఖో ఖో పురుషుల సెమీ ఫైనల్..**

అమరావతి ఛాంపియన్‌షిప్ రాష్ట్రస్థాయి పోటీలలో భాగంగా ఎస్వీ యూనివర్సిటీ తారకరామా గ్రౌండ్స్‌లో జరుగుతున్న ఖో ఖో సెమీ ఫైనల్ పోటీల్లో అండర్-17 విభాగంలో చిత్తూరు-అనకాపల్లి, అండర్-23 విభాగంలో బాపట్ల-విజయనగరం జట్లు తలపడనున్నాయి. ఈ సందర్భంగా క్రీడాకారులను పరిచయం చేసుకున్న శాప్ చైర్మన్ రవి నాయుడు, ఇరు జట్ల క్రీడాకారులకు శుభాకాంక్షలు తెలిపారు.

27 CTR 5:27 CTR 5.qxd 8/26/2026 10:36 PM Page 1



# తిరుపతి డివిజన్

## విద్యార్థులపై ఆర్థిక భారం తగ్గించడమే లక్ష్యం

### -ఎస్వీ జేసీలో విద్యా కానుకగా ఉచిత పుస్తకాల పంపిణీ



**తిరుపతి విద్య, ఆగస్టు 26 ప్రభాతవార్త:**
విద్యార్థులపై పుస్తకాల కొనుగోలు భారం తగ్గించి, చదువుకు అవసరమైన వనరులను సమకూర్చే లక్ష ్యంతో తిరుమల తిరుపతి దేవస్థానాల ఆధ్వర్యంలోని శ్రీ వేంకటేశ్వర జూనియర్ కళాశాలలో విద్యా కానుక కార్యక్రమాన్ని నిర్వహించారు. దేవస్థానం విద్యాధికారి సూచన మేరకు బుధవారం జరిగిన కార్యక్రమంలో కళాశాల ప్రిన్సిపాల్ సి. ప్రకాష్ బాబు విద్యార్థులకు ఉచిత పాఠ్య, నోటు పుస్తకాలను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ప్రిన్సిపాల్ మాట్లాడుతూ విద్యార్థులందరికీ సమానంగా విద్యా వనరులు అందుబాటులో ఉండేలా తితిదే చేపడుతున్న చర్యలు అభినందనీ యమన్నారు. పుస్తకాలు కొనుగోలు చేసే ఆర్థిక స్థోమత లేక చదువులో వెనుకబడే పరిస్థితులను నివారించేందుకు ఈ కార్యక్రమం ఎంతగానో ఉపయోగపడుతుందని తెలిపారు. ఉచిత పుస్తకాలతో విద్యార్థుల్లో చదువుపై ఆసక్తి, ఆత్మవిశ్వాసం పెరిగి మెరుగైన ఫలితాలు సాధించే అవకాశం ఉంటుందన్నారు. విద్యార్థుల ఉన్నత విద్యకు మరింత ప్రోత్సాహం అందించేందుకు త్వరలో నీట్, జేఈఈ ప్రవేశ పరీక్షలకు సంబంధించిన అధ్యయన సామగ్రిని కూడా అందజేస్తామని తెలిపారు. విద్యార్థుల కుటుంబాలపై ఆర్థిక భారం తగ్గించేలా సహకరిస్తున్న తితిదే ఛైర్మన్ బి.ఆర్. నాయుడు, కార్యనిర్వహణాధికారి ముద్దాడ రవిచంద్ర, సంయుక్త కార్య నిర్వహణాధికారి డా. ఏ. శరత్, విద్యా ఆరోగ్య సంయుక్త కార్యనిర్వహణాధికారి ప్రభల గోపీనాథ్, దేవస్థానం విద్యాధికారి డి. ఫణికుమార్ నాయుడు, విద్యా కమిటీ సభ్యులు, విద్యాశాఖకు కృతజ్ఞతలు తెలిపారు. ఈ కార్యక్రమంలో అధ్యాపకులు పట్నం ప్రియవర్ధన బాబు, డా. సి.ఎల్. చెన్నారెడ్డి, హాస్టల్ వార్డెన్ డా. మధు, డిప్యూటీ వార్డెన్ డా.పూజారి ప్రసాద్, కళాశాల సిబ్బంది, విద్యార్థులు పాల్గొన్నారు.

## నీలకంఠునికి ఎంఎల్ఏచే పట్టువస్త్రాలు:



**శ్రీకాళహస్తి రూరల్,ఆగస్టు 26 ప్రభాతవార్త:**
శ్రీకాళహస్తీశ్వరాలయానికి అనుబంధంగా నిర్వహిస్తున్న ఊరందూరులోని నీలకంఠేశ్వరాలయంలో జరుగుతున్న బ్రహ్మోత్సవాల్లో భాగంగా బుధవారం శాసనసభ్యుడు బొజ్జల వెంకట సుధీర్‌రెడ్డి స్వామి అమ్మవార్లకు పట్టువస్త్రాలను అందించారు.అనుబంధ ఆలయాల్లో ఉత్సవాలకు అత్యధిక ప్రాధాన్యత ఇవ్వాలని శాసనసభ్యుడు సూచించిన మేరకు నీలకంఠేశ్వరాలయంలో ఉత్సవాలు అంగరంగ వైభవంగా నిర్వహిస్తున్నారు. బుధవారం నందది సేవ సందర్భంగా ఎంఎల్ఏ పట్టు వస్త్రాలను అందించారు.ఆయనకు ఆలయ మర్యాదలతో ఎఇఓ హేమామాలిని చిన్న ఆలయాల ఇన్‌చార్జి లక్ష్మయ్య గుమాస్తా దుర్గా ప్రసాద్ సారథ్యంలో వేద పండితులతో స్వాగతం పలికారు.ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ తమ గ్రామంలో పరమేశ్వరుని వరంతో నీలకంఠుడు వెలసి చుట్టు పక్కల గ్రామాల ప్రజలకు వరాలిస్తున్నారన్నారు.ప్రతి ఏడాది బ్రహ్మోత్సవాలను కన్నుల పండువగా నిర్వహిస్తున్నారని తెలిపారు.ఉత్సవాలు మన సంప్రదాయాలకు నిలయాలన్నారు. భావితరాలకు మన పండగలు, ఉత్సవాలు తెలియాలంటే గ్రామాల్లోని ప్రతి దేవాలయంలో ఉత్సవాలకు అత్యధిక ప్రాధాన్యత కల్పించాలన్నారు. ఎంఎల్ఏతో పాటు నీలకంఠారెడ్డి,బత్తిరెడ్డి, ప్రదీప్‌రెడ్డి గ్రామస్తులు పాల్గొన్నారు. ఆలయం వద్ద ఆయనకు ఆలయ అర్చకులు జనార్థన్‌శర్మ, ఆంజనేయ శర్మ, దక్షిణామూర్తి తదితరులు పాల్గొన్నారు.కార్యక్రమాలను ఎఇఓ హేమామాలిని పర్యవేక్షించారు.

## తిరుమల తరహాలో అభివృద్ధి : ఎమ్మెల్యే సుధీర్‌రెడ్డి



**శ్రీకాళహస్తిరూరల్,ఆగస్టు 26 ప్రభాతవార్త**
శ్రీకాళహస్తి మండలంలోని తొండమాన్‌పురంలో టిటిడికి అనుబంధంగా నిర్వహిస్తున్న శ్రీదేవి,భూదేవి సమేత వెంకటేశ్వరస్వామి ఆలయానికి సంబంధించి వచ్చే భక్తులకు సదుపాయాలు కల్పించాల్సి ఉందని శాసనసభ్యుడు సుధీర్‌రెడ్డి అభిప్రాయపడ్డారు. ఇక్కడ వెలసిన స్వామి అమ్మవార్ల ఆలయానికి వచ్చే భక్తుల సదుపాయాలకు సంబంధిత అధికారులతో చర్చించారు. బుధవారం ఆయన మాట్లాడుతూ ఇక్కడ జరుగుతున్న పవిత్రోత్సవాల సందర్భంగా పాల్గొన్న ఆయన ఆలయంలో సదుపాయాల గురించి ఇక్కడ పని చేసే అర్చకులతో చర్చించారు. ఆలయ పరిసరాలతో పాటు పోటును ఆయన తనిఖీ చేసారు. ఇక్కడ ప్రసాదాలు తయారుచేసే అర్చకులతో ఏమైనా సమస్యలున్నాయా? అని అడిగి తెలుసుకున్నారు. తొండమాన్‌చక్రవర్తిచే నిర్మించిన ఆలయాన్ని తిరుమల తరహాలో తీర్చి దిద్దాల్సిన అవసరం ఎంతైనా ఉందని అభిప్రాయపడ్డారు.టిటిడికి అనుబంధంగా ఉన్న ఈ ఆలయం అభివృద్ధికి సంబంధించి ఇఓ,ఛైర్మెన్‌లతో చర్చిస్తామని వివరించారు. అలాగే రోడ్డును వెడల్పు చేయాలని అందుకు సంబంధించి రెవెన్యూ అధికారులు రోడ్డును రికార్డుల ప్రకారం సర్వే చేయాలని సూచించారు. తిరుమలలో స్వామి వారి ఆలయం పక్కనే పుష్కరిణి ఉన్నట్లు తొండమాన్‌పురంలో ఏర్పాటు చేయాల్సిన అవసరం ఎంతైనా ఉందన్నారు. ఆలయ విశిష్టతను నలుదిశలా వ్యాపించచేసేటట్లు టిటిడి స్పందించాలని వివరించారు.

## కన్నుల పండువగా నంది సేవ



**శ్రీకాళహస్తిరూరల్,ఆగస్టు 26 ప్రభాతవార్త:**
శ్రీకాళహస్తీశ్వరాలయానికి అనుబంధంగా శ్రీకాళహస్తి మండలం ఊరందూరు గ్రామంలో వెలసిన అన్నపూర్ణ సమేత నీలకంఠేశ్వరాలయంలో జరుగుతున్న బ్రహ్మోత్సవాల్లో భాగంగా బుధవారం రాత్రి నంది సేవ కార్యక్రమాలు కన్నుల పండువగా నిర్వహించారు.ఈ సందర్భంగా స్వామి వారిని ప్రత్యేకాలంకారం నిర్వహించారు. నందిపై నీలకంఠుని దర్శించుకొనుటకు చుట్టుపక్కల గ్రామాల నుంచి భక్తులు విశేష సంఖ్యలో కదలి వచ్చారు. కన్నుల పండువగా ఉత్సవాన్ని ఆలయ ఎఇఓ హేమామాలిని, చిన్న ఆలయాల ఇన్‌చార్జి లక్ష్మయ్య, దుర్గా ప్రసాద్‌లు పర్యవేక్షించారు.

## మహిళ మెడలో బంగారు గొలుసు చోరీ!



**రామచంద్రాపురం, ఆగస్టు 26 ప్రభాతవార్త:**
సినీఫక్కీలో మహిళ మెడలో బంగారు గొలుసు చోరీ చేసిన సంఘటన బుధవారం కాలేపల్లి గ్రామంలో చోటు చేసుకున్నది. పోలీసుల వివరాల మేరకు... కాలేపల్లికి చెందిన బాదూరు కావమ్మ గొల్లపల్లిలో ఓ కార్యక్రమానికి కాలినడకన వెళుతుండగా కాలేపల్లి-గొల్లపల్లి మధ్యన పెద్దేటి వంక వంతెన వద్ద ఇద్దరు యువకులు కాపుకాసి ఆమె మెడలోని సుమారు 40 గ్రాముల చైన్ లాక్కుని ద్విచక్ర వాహనంపై పారిపోయారు. దీంతో ఆమె బోరువిలపిస్తూ కుటుంబ సభ్యులకు సమాచారం ఇచ్చింది. కుటుంబ సభ్యులు, గ్రామస్థులతో కలసి పోలీసులకు పిర్యాదు చేశారు. సిఐ సురేష్‌కుమార్ సంఘటనా స్థలికి చేరుకుని వివరాలు సేకరించారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు.

## విలువలులేని వ్యక్తి భూమన : జెబి శ్రీనివాస్

**తిరుపతి, ఆగస్టు 26 ప్రభాతవార్త:**
నిత్యం విలువలు, నిజాయితీ, గురించి పదేపదే మాట్లాడే భూమన కరుణాకర్ రెడ్డి కి ఎలాంటి విలువలు, నీతి, లేదని తిరుపతి టీడీపీ ఇంచార్జ్ జెబీ శ్రీనివాస్ అన్నారు బుధవారం జరిగిన విలేకరుల సమావేశంలో ఆయన అన్నారు. ఆయన మాట్లాడుతూ కరుణాకర్ రెడ్డి ఓ వృద్ధ పతివ్రత లాగా, తనకు తాను శుద్ధపూసగా చెప్పుకుంటూ జీవిస్తున్నాడు. గ్రాంథిక భాషలో నాలుగు పడికట్టు పదాలు మాటలు మాట్లాడినంత మాత్రాన అతను పెద్దమనిషి అయిపోరన్నారు. భూమన మొదటిసారి తిరుమల తిరుపతి దేవస్థానం ఛైర్మన్ పదవి వెలగబెట్టినప్పుడు అకౌంట్స్ డిపార్ట్మెంట్‌తో ఆయనకు ఏమి పని భూమనను ప్రశ్నించారు. పెద్దమనిషి ముసుగులో మేకతోలు కప్పుకున్న గుంటనక్క కరుణాకర్ రెడ్డి అని, తనస్వార్ధ కోసం, ఆనందం కోసం పచ్చటి కుటుంబాల్లో చిచ్చుపెట్టి వాళ్ల నాశనానికి ప్రధాన కారణమైన వ్యక్తి అని అన్నారు. అనగాని సత్యప్రసాద్‌ది ఉన్నతమైన కుటుంబం అని, ఆయనది స్వచ్ఛమైన జీవితం మన్నారు. మద్యం పాలసీ గురించి కరుణాకర్ రెడ్డి కూడా మాట్లాడితే జనం నవ్వుకుంటున్నారన్నారు. గత మీ ప్రభుత్వ పనికిమాలిన మద్యం పాలసీతో విసిగిపోయిన జనమే కూటమికి బ్రహ్మరథం పట్టారన్నారు. భూమనకు దమ్ము, ధైర్యం ఉంటే రానున్న లోకల్ బాడీ ఎన్నికల్లో అయన కొడుకు అభినయ్‌రెడ్డిని అదే నాలుగవ వార్డు నుండి కార్పొరేటర్‌గా పోటీ చేయాలన్నారు. ఈ విలేకరుల సమావేశంలో మాజీ డిప్యూటీ మేయర్ ఆర్.సి మునికృష్ణ, గంగమ్మ గుడి ఛైర్మన్ మహేష్ యాదవ్, బుల్లెట్ రమణ కృష్ణ యాదవ్ మునిశేఖర్,శ్రీధర్ తదితరులు పాల్గొన్నారు

## కూటమి ప్రభుత్వంతోనే రాష్ట్ర అభివృద్ధి



**విజయపురం, ఆగస్టు 26 ప్రభాతవార్త:**
ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు సారథ్యంలోని కూటమి ప్రభుత్వంతోనే రాష్ట్ర అభివృద్ధి, ప్రజా సంక్షేమం జరుగుతోందని అగరం రామకృష్ణ సింగిల్‌విండో అధ్యక్షుడు బాబునాయుడు పేర్కొన్నారు. రెండేళ్ళ పాలనలో నమ్మకం, అభివృద్ధి, సంక్షేమం కార్యక్రమాలపై టీడీపీ మండల రమేష్‌రాజు, క్లస్టర్ కన్వీనర్ మునిభాస్కర్‌రాజు, కో-కన్వీనర్ బాబు ఆధ్వర్యంలో బుధవారం మండలంలోని వరదరాజుల కండ్రిగ, కేవీ పురం, కేవీ శ్రీరామపురం గ్రామాల్లో పార్టీ నాయకులు ఇంటింటికి వెళ్లి రెండేళ్ళ పాలనలో జరిగిన అభివృద్ధి, సంక్షేమంపై ముద్రించిన కరపత్రాలను పంపిణీ చేశారు. కార్యక్రమంలోస్థానిక నాయకులు మధునాయుడు, జీవరత్నంనాయుడు, కపిల్, గాలి మురళీనాయుడు, ప్రకాష్‌రాజు, పలువురు కార్యకర్తలు పాల్గొన్నారు.

## మాజీ సిఎంను కలిసిన వడకలూరు



**శ్రీకాళహస్తి, ఆగస్టు 26 ప్రభాతవార్త:**
తిరుమల శ్రీవారి దర్శనార్థం బుధవారం పాండిచ్చేరి మాజీ ముఖ్యమంత్రి వి.నారాయణ స్వామి తిరుమలను దర్శించుకున్నారు. ఆయన్ను శ్రీకాళహస్తి దేవస్థానం ట్రస్టుబోర్డు మాజీ సభ్యులు, న్యాయవాది వడకలూరు మస్తానయ్య ఘన స్వాగతం పలికి శ్రీవారి దర్శన ఏర్పాట్లను పర్యవేక్షించారు. అనంతరం తిరుచనూరులోని పద్మావతి అమ్మవారి ఆల యంలో కుటుంబ సభ్యులతో కలిసి దర్శించుకున్న మాజీ ముఖ్యమంత్రి నారాయణ స్వామికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆలయాధికారులు పిఆర్ఓ భరత్, జయచంద్ర, నెల్లూరు జగదీష్, విజయ్‌భాస్కర్ తదితరులు పాల్గొన్నారు.

## ధ్యానం ద్వారా వ్యక్తిగత జీవితాల్లో మార్పులు

**తిరుపతి కలెక్టరేట్, ఆగస్టు 26 ప్రభాతవార్త:**



పీఎంసీ నిర్వహణలో ప్రపంచశాంతి కోసం కొనసాగుతున్న ధ్యాన మహాయజ్ఞం ఐదో రోజుకు ఘనంగా చేరుకుంది. ఉదయం వయోలిన్ గణేష్ బృందం ఆధ్వర్యంలో సంగీత నాద ధ్యానం నిర్వహించగా, విశేష సంఖ్యలో ధ్యానులు పాల్గొన్నారు. ఆచార్య సాంగత్యం కార్యక్రమంలో సీనియర్ పిరమిడ్ మాస్టర్లు సూర్యనారాయణ, సంగాల రాము తమ ధ్యాన అనుభవాలను పంచుకున్నారు. సీనియర్ పిరమిడ్ మాస్టర్ టి. మురళీధర్ ఆధ్యాత్మిక శాస్త్రంలోని ధ్యానం, దివ్యజ్ఞానం, నిత్య జాగరూకత, సంకల్పశక్తి అంశాలను వివరించారు. డాక్టర్ పి.ఎస్. గోపాలకృష్ణ ఆధ్యాత్మిక జీవనం, ధ్యానం, ఆరోగ్యంపై సందేశం అందించారు. పీఎస్ఎస్ఎం సహ వ్యవస్థాపకురాలు స్వర్ణమాల పత్రీ ధ్యాన మహాయజ్ఞం నిర్వహణను అభినందిస్తూ బ్రహ్మర్షి పత్రీజీ సేవలను కొనియాడారు. ఈ సందర్భంగా స్వర్ణమాల పత్రీకి పీఎంసీ డైరెక్టర్లు, ట్రస్ట్ సభ్యులు లైఫ్‌టైమ్ అచీవ్‌మెంట్ అవార్డును ప్రదానం చేసి ఘనంగా సత్కరించారు. పీఎస్ఎస్ఎం అభివృద్ధికి విశేష కృషి చేసిన సీనియర్ పిరమిడ్ మాస్టర్లు జి. సుబ్రహ్మణ్యం, అండమాన్ సురేష్‌లకు కూడా లైఫ్‌టైమ్ అచీవ్‌మెంట్ అవార్డులు అందజేశారు. ధ్యానం ద్వారా వ్యక్తిగత జీవితాల్లో సానుకూల మార్పులు సాధ్యమని, ధ్యాన ప్రచారాన్ని మరింత విస్తరించాలని వారు పిలుపునిచ్చారు.

## విద్యార్థులలో వ్యక్తిత్వ వికాసం పెంపుకు అవగాహన

### -ప్రవాస భారతీయుడు చింతపర్తి ఓం ప్రకాష్‌రెడ్డి వితరణ

**చంద్రగిరి, ఆగస్టు 26 ప్రభాతవార్త:**



ప్రవాస భారతీయుడు అమెరికా, న్యూజెర్సీలో సాఫ్ట్‌వేర్ ఇంజినీర్‌గా పనిచేస్తున్న చింతపర్తి ఓం ప్రకాష్ రెడ్డి విద్యార్థులలో వ్యక్తిత్వ వికాసం పెంపుకు తనవంతు వితరణ చేశారు. స్థానిక ప్రభుత్వ బాలుర ఉన్నత పాఠశాలలో క్విజ్ మాస్టర్ ఈ.రియాజ్ విద్యార్థులకు విద్యార్థులకు వ్యక్తిత్వ వికాసం, జ్ఞాపకశక్తి పెంపు, ఏకాగ్రత, ఆత్మ విశ్వాసం వంటి అంశాలపై పలు విలువైన సూచనలు, మెళుకువలను నేర్పించారు. చదువును ఆసక్తి కరంగా మార్చుకోవడం, విషయాలను సులభంగా గుర్తుంచు కోవడం వంటి అంశాలపై అవగాహన కల్పించారు. విద్యార్థుల ఉజ్వల భవిష్యత్తుకు దోహదపడగల అంశాలపై అవగాహనా నిర్వహించడంలో దాతృత్వం వహించిన చింతపర్తి ఓం ప్రకాష్ రెడ్డికి కృతజ్ఞతలు తెలిపారు.

## తిరుచ్చి వాహనంపై కల్యాణ వెంకన్న

**చంద్రగిరి, ఆగస్టు 26 ప్రభాతవార్త:**



శ్రీనివాస మంగాపురంలో వెలసియున్న కల్యాణ వెంకటేశ్వర స్వామి వారి జన్మనక్షత్రం శ్రవణ నక్షత్రంను పురస్కరిం చుకుని బుధవారం కల్యాణ వెంకన్న తిరుచ్చి వాహనంపై విహరిస్తూ భక్తులకు దర్శనమిచ్చారు. ఇందులో భాగంగా ఆలయ అర్చకులు స్వామివారిని వేకువ జామున సుప్రభాత సేవతో మేల్కొలిపి, తోమాల అర్చనాధి నిత్యకైంకర్యాలను ఆగమోక్తంగా నిర్వహించారు. సాయంత్రం శ్రీదేవి భూదేవి సమేత స్వామివారు విశేష అలంకృతులై తిరుచ్చి వాహనంపై అధిష్టించి భక్తుల గోవింద నామస్మరణల నడుమ తిరుమాడ వీధులలో ఊరేగారు. ఈ కార్యక్రమంలో ఆలయ డిప్యూటీ ఈఓ వరలక్ష్మి, ఏఈఓ ఎం.గోపినాథ్, సూపరింటెండెంట్ రాజ్‌కుమార్, టెంపుల్ ఇన్‌స్పెక్టర్ ద్వారక మునికుమార్, ఆర్జితం ఇన్‌స్పెక్టర్ ఆనుంబట్టు ధనశేఖర్, అర్చకులు రాజశేఖర్, జమేధర్ చంద్రశేఖర్, ఆలయ సిబ్బంది పాల్గొన్నారు.

## నవంబర్ 27న ముక్కోటిలో చాగంటి ప్రవచనాలు

### -ఆలయ ధర్మకర్త మొగిలి ఇందుమౌళి రెడ్డి

**చంద్రగిరి, ఆగస్టు 26 ప్రభాతవార్త:**



ఈ సంవత్సరం నవంబర్ 27న ముక్కోటి అగస్త్యేశ్వర స్వామి వారి ఆలయంలో బ్రహ్మశ్రీ చాగంటి కోటేశ్వర రావు ప్రవచనాలు వినిపించనున్నట్లు ఆలయ ధర్మకర్త మొగిలి ఇందుమౌళి రెడ్డి తెలిపారు. ముక్కోటి ఆలయ ధర్మకర్తగా బాధ్యతలు చేపట్టిన నాటి నుండి ఆలయ అభివృద్ధికి వందేళ్ళలో ఎన్నడూ లేని రీతిన పలు అభివృద్ధి కార్యక్రమాలకు ఆయన శ్రీకారం చుట్టారు. యుద్ధప్రాతిపధికన జరుగుతున్న ఆలయ అభివృద్ధి పనులను పర్యవేక్షిస్తూ ఈ మేరకు బుధవారం ఆయన ఆలయంలో నిర్వహించ తలపెట్టి కార్యక్రమాలను వివరించారు. ఈ సంవత్సరం నవంబర్‌లో రుద్రాల ముక్కోటి-2026 ఉత్సవాలను అత్యంత భక్తిశ్రద్ధలతో అంగరంగ వైభవంగా నిర్వహించడానికి ఏర్పాట్లను ముమ్మరంగా చేపట్టినట్లు తెలిపారు. ఇందులో నవంబర్ 27 సాయంత్రం 6 గంటల నుండి 8 గంటల వరకు చాగంటి ప్రవచన కార్యక్రమం వుంటుందన్నారు.

## ఈ నెల 28న సర్వ సభ్య సమావేశం

**పులిచెర్ల, ఆగస్టు 26 ప్రభాతవార్త:**
పులిచెర్ల మండల ప్రజా పరిషత్ కార్యాలయంలో ఈ నెల 28న శుక్రవారం 10.30 గంటలకు సాధారణ సర్వ సభ్య సమావేశం నిర్వహిస్తున్నట్లు ఎంపిడిఓ ఒక ప్రకటనలో తెలిపారు. మండల ప్రజా పరిషత్ ప్రాదేశిక సభ్యులు, గౌరవ కో ఆప్షన్ సభ్యులు, గ్రామ పంచాయితీ ప్రత్యేక అధికారులు సర్వ సభ్య సమావేశానికి హాజరుకావాలని కోరారు. మండల స్థాయి అధికారులు, పంచాయితీ కార్యదర్శులు వారి వారి ప్రగతి నివేదికలతో సదురు సమావేశానికి తప్పక హాజరు కావాలని తెలిపారు.

## ఉపాధ్యాయుల సమస్యలపై పోరాటమే లక్ష్యం

### -పీఆర్టీయూ తిరుపతి జిల్లా నూతన కార్యవర్గం ఎన్నిక

**తిరుపతి విద్య, ఆగస్టు 26 ప్రభాతవార్త:**
ఉపాధ్యాయుల సమస్యల పరిష్కా రానికి ఐక్యంగా పోరాడాలని పీఆర్టీయూ రాష్ట్ర నాయకులు పిలుపునిచ్చారు. తిరుపతిలోని విశ్వం హైస్కూల్‌లో బుధవారం నిర్వహించిన విస్తృతస్థాయి సమావేశంలో పీఆర్టీయూ తిరుపతి జిల్లా నూతన కార్యవర్గాన్ని ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. జిల్లా అధ్యక్షుడిగా ఎం. సుధాకర్ ఆచారి, ప్రధాన కార్యదర్శిగా జోగి గురుప్రసాద్ యాదవ్ ఎన్నికయ్యారు.సమావేశానికి రాష్ట్ర అధ్యక్షుడు మిట్టా కృష్ణయ్య, రాష్ట్ర ప్రధాన కార్యదర్శి గిరిప్రసాద్ రెడ్డి ముఖ్య అతిథులుగా హాజరయ్యారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఉపాధ్యాయులపై బోధనేతర పనుల భారాన్ని తగ్గించాలని, ఆర్థిక బకాయాలను వెంటనే విడుదల చేయాలని డిమాండ్ చేశారు. పీఆర్సీ కమిటీ ఏర్పాటు చేసి 30 శాతం మధ్యంతర భృతిని ప్రకటించాలని, టెట్‌ను రద్దు చేయాలని కోరారు. ఉపాధ్యాయుల హక్కులు, సమస్యల పరిష్కారం కోసం సంఘం నిరంతరం కృషి చేస్తుందని తెలిపారు. నూతన జిల్లా అధ్యక్షుడు, ప్రధాన కార్యదర్శి బాధ్యతలను సమర్ధవంతంగా నిర్వహించి ఉపాధ్యాయుల సమస్యల పరిష్కారానికి కృషి చేస్తారని తెలిపారు.కార్యక్రమంలో పాకాల మండల ఎంఈఓ లింగయ్య, పూర్వపు జిల్లా ప్రధాన కార్యదర్శి టి. సదాశివన్, పూర్వపు జిల్లా అధ్యక్షుడు శ్రీనివాస యాదవ్, జిల్లా వర్కింగ్ ప్రెసిడెంట్ తుకారాం, చిత్తూరు జిల్లా ప్రధాన కార్యదర్శి విజయభాస్కర్ రెడ్డి, రాష్ట్ర, జిల్లా కార్యవర్గ సభ్యులు, వివిధ మండలాల బాధ్యులు, ఉపాధ్యాయులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.



అధ్యక్షులు
M సుధాకరాచారి



ప్రధాన కార్యదర్శి
జోగి గురు ప్రసాద్ యా

27 CTR 6:27 CTR 6.qxd 8/26/2026 10:38 PM Page 1



## మహా గణపతి మహాకుంభాభిషేకం

**పుత్తూరురూరల్, ఆగస్టు 26 ప్రభాతవార్త:**
పుత్తూరు మండలంలోని తడుకు పంచాయతీ పరిధి తిమ్మరాజు కండ్రిగ గ్రామంలో నూతనంగా నిర్మించిన సిద్ధి బుద్ధి సమేత మహా గణపతి ఆలయంలో బుధవారం నుంచి మహా కుంభాభిషేకం కార్యక్రమాన్ని భక్తిశ్రద్ధలతో ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా వేద పండితుల ఆధ్వర్యంలో ప్రత్యేక పూజలు, హోమాలు, వేద మంత్రోచ్చారణలతో ఆలయ ప్రాంగణం ఆధ్యాత్మిక వాతావరణాన్ని సంతరించుకుంది. ఈ కార్యక్రమంలో తిమ్మరాజు కండ్రిగతో పాటు పరిసర గ్రామాల ప్రజలు పాల్గొని స్వామివారిని దర్శించుకుని ప్రత్యేక పూజలుచేశారు. ఆలయ ధర్మకర్త దొమ్మరాజు సుబ్రహ్మణ్యంరాజు(బంగారు రాజు), అమర, అంకయ్య, శ్రీనివాసులురెడ్డి, రవి, శేఖర్‌రాజు, డి.వి.రాజు పాల్గొన్నారు.

## నేడు బ్రహ్మసూత్ర తత్వప్రకాశిక గ్రంథావిష్కరణ

**శ్రీకాళహస్తి, ఆగస్టు 26 ప్రభాతవార్త:**
శ్రీకాళహస్తి పట్టణంలోని శ్రీ శుకబ్రహ్మ శ్రమము నందు గురువారం ఉదయం 10 గంటలకు బ్రహ్మసూత్ర తత్వప్రకాశిక గ్రంథావిష్కరణ మహోత్సవం అత్యంత వైభవంగా జరగనుంది. శ్రీ సదాశివ బ్రహ్మేంద్రుల బ్రహ్మసూత్ర వృత్తికి తెలుగు అనువాదంగా శ్రీ విద్యా స్వరూపానందగిరి స్వాములవారు ఈ గ్రంథాన్ని రచించారు. ఈ ఆవిష్కరణ కార్యక్రమంలో స్వరూపానందగిరి స్వాములు, సత్యాత్మానంద సరస్వతీ స్వాములవారు చిన్మయ మిషన్ ఒంగోలు, సర్వాత్మానందగిరి స్వాములు , బ్రహ్మశ్రీ కుప్పా వెంకటకృష్ణమూర్తి,మైసూరు దత్తపీఠ విద్యాధికారి, శ్రీ తపూరు గోపీ, రామకృష్ణాశ్రమము సంస్థాపకులు రాజులపాలెం తదితరులు పాల్గొననున్నారు. గ్రంథ ముద్రణకు విరాళమిలిచ్చిన దాతలకు, గ్రంథమును ముద్రించిన హర్షవర్ధన్‌కి, శ్రీవారి గ్రాఫిక్స్ గుణభూషణ్‌కి సన్మానం చేయనున్నారు. భక్తులు, ఆధ్యాత్మిక వేత్తలు ఈ కార్యక్రమంలో పాల్గొని విజయవంతం చేయవలసిందిగా నిర్వాహకులు కోరుతున్నారు.

## స్విమ్స్ ఫిజియోథెరపీ కళాశాల ఆధ్వర్యంలో అతిథి ఉపన్యాసం

**స్విమ్స్ ఆగస్టు 26 ప్రభాతవార్త:**



శ్రీ వేంకటేశ్వర వైద్య విజ్ఞాన సంస్థ (స్విమ్స్) ఫిజియోథెరపీ కళాశాల ఆధ్వర్యంలో 26.08.2026వ తేది బుధవారం ఉదయం 11 గంటలకు శ్రీ పద్మావతి ఆడిటోరియం నందు ""Applying the ICF Model in Clinical Practice"" అనే అంశంపై గెస్ట్ లెక్చర్ కార్యక్రమం నిర్వహించినట్లు మెడికల్ సూపరింటెండెంట్ డా రామ్ గారు తెలియజేశారు.
ఈ కార్యక్రమాన్ని స్విమ్స్ ఫిజియోథెరపీ కాలేజీ అసోసియేట్ ప్రొఫెసర్ డాక్టర్ విశ్వనాథరెడ్డి, అసిస్టెంట్ ప్రొఫెసర్ డాక్టర్ సెంథిల్ కుమార్, బెంగళూరు నుండి రాజరాజేశ్వరి కాలేజ్ ఆఫ్ ఫిజియోథెరపీ ప్రొఫెసర్ మరియు ప్రిన్సిపాల్ డా. పి. బాలసుబ్రహ్మణియన్ గార్లు జ్యోతిని వెలిగించి కార్యక్రమాన్ని ప్రారంభించారు.ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా బెంగళూరు నుండి రాజరాజేశ్వరి కాలేజ్ ఆఫ్ ఫిజియోథెరపీ ప్రొఫెసర్ మరియు ప్రిన్సిపాల్ డా. పి. బాలసుబ్రహ్మణియన్ గారు హాజరై విద్యార్థులకు పవర్ పాయింట్ ప్రజెంటేషన్ ద్వారా రోగి సమస్యను కేవలం వ్యాధి లేదా శారీరక లోపం ఆధారంగా మాత్రమే కాకుండా, రోగి రోజువారీ కార్యకలాపాలు, సామాజిక భాగస్వామ్యం, పర్యావరణ పరిస్థితులు మరియు వ్యక్తిగత అంశాలను కూడా పరిగణనలోకి తీసుకుని సమగ్రంగా అంచనా వేయడం ఐసిఎఫ్ మోడల్ ముఖ్య ఉద్దేశమని వివరించారు. ఫిజియోథెరపీ మరియు ఇతర వైద్య సేవల్లో బసిఎఫ్ మోడల్ను ఉపయోగించడం ద్వారా రోగి అవసరాలను మరింత స్పష్టంగా గుర్తించి, తగిన చికిత్సా లక్ష్యాలను రూపొందించవచ్చని ఆయన తెలిపారు. రోగి కేంద్రంగా చికిత్స అందించడంలో ఐసిఎఫ్ మోడల్ ఎంతో ఉపయోగకరంగా ఉంటుందని పేర్కొన్నారు.ఫిజియోథెరపీ అసోసియేట్ ప్రొఫెసర్ డా విశ్వనాథ్ రెడ్డి గారు మాట్లాడుతూ.... ఫిజియోథెరపీ విద్యార్థులకు ఐ.సి.ఎఫ్ మోడల్పై అవగాహన చాలా అవసరమని అన్నారు. రోగిని కేవలం వ్యాధి కోణంలో కాకుండా, వారి రోజువారీ కార్యకలాపాలు, సామాజిక భాగస్వామ్యం మరియు జీవన నాణ్యత వంటి అంశాలను కూడా పరిగణనలోకి తీసుకుని చికిత్స అందించాల్సిన అవసరాన్ని వివరించారు. విద్యార్థులు ఇలాంటి నిపుణుల గెస్ట్ లెక్చర్లను సద్వినియోగం చేసుకోవాలని ఆమె సూచించారు.ఈ కార్యక్రమానికి డాక్టర్ సెంథిల్ కుమార్, అసిస్టెంట్ ప్రొఫెసర్ సమన్వయకర్తగా వ్యవహరించారు. ఫిజియోథెరపీ కాలేజీ డాక్టర్ విశ్వనాథరెడ్డి, డాక్టర్ సెంథిల్ కుమార్ గార్లు అతిథిగా విచ్చేసిన డాక్టర్. పి. బాలసుబ్రహ్మణియన్ గారిని శాలువాతో ఘనంగా సత్కరించారు.ఈ కార్యక్రమంలో అధ్యాపకులు, విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు. కార్యక్రమం విజయవంతంగా ముగిసింది.

## నోటీసుల విచారణ ఫైలింగ్ సక్రమంగా నిర్వహించాలి: ఎం. జయకృష్ణ



**తిరుపతి, ఆగస్టు 26:**
ప్రత్యేక ఓటర్ల జాబితా సమగ్ర సవరణ (SIR) ప్రక్రియలో భాగంగా నోటీసుల విచారణ ఫైలింగ్‌ను కచ్చితంగా, సక్రమంగా నిర్వహించాలని నియోజకవర్గ ఓటర్ నమోదు అధికారి, నగరపాలక సంస్థ కమిషనర్ ఎం. జయకృష్ణ అధికారులకు ఆదేశించారు.167 తిరుపతి అసెంబ్లీ నియోజకవర్గ పరిధిలోని తాతయ్యగుంట, ఎల్ఐసీ రోడ్డు, ప్రకాశం రోడ్డు, దాసరి మఠం వార్డుల్లో నిర్వహిస్తున్న ఎస్ఐఆర్ నోటీసుల విచారణ కేంద్రాలను ఆయన గురువారం పరిశీలించారు. ఈ సందర్భంగా విచారణ ప్రక్రియపై అధికారులకు పలు సూచనలు చేశారు.విచారణ సమయంలో ఓటరు సమర్పించిన ఆధారాలు, ఇచ్చిన రసీదు, సంబంధిత ఎన్యుమరేషన్ ఫారం, హాజరు పట్టిక, బీఎల్ఓ డిక్లరేషన్, విచారణ నివేదిక వంటి అన్ని పత్రాలను సమగ్రంగా ఫైలింగ్ చేయాలని స్పష్టం చేశారు. ఓటరుకు నోటీసు ఎందుకు జారీ అయిందో వివరించి, అవసరమైన పత్రాలు సేకరించి విచారణను పూర్తి చేయాలని ఏఈఆర్‌వోలు, సూపర్వైజర్లు, బీఎల్‌ఓలకు సూచించారు.ఎన్నికల కమిషన్ మార్గదర్శకాలను పూర్తిగా అవగాహన చేసుకుని విధులు నిర్వర్తించాలని, నిర్లక్ష్యం వహిస్తే చర్యలు తప్పవని హెచ్చరించారు. షెడ్యూల్ తేదీకి ముందుగానే విచారణకు హాజరయ్యే ఓటర్ల నుంచి కూడా ఆధారాలు స్వీకరించి, సంతకం, గ్రూప్ ఫోటోతో సహా ఫైలింగ్ చేయాలని తెలిపారు.ఈ కార్యక్రమంలో తహసీల్దార్ సురేష్‌బాబు, ఎన్నికల ఉప తహశీల్దార్ సుధాకర్ నాయక్, డి.ఈ. మహేష్ తదితరులు పాల్గొన్నారు.

## ప్రారంభమైన అయ్యప్ప ఆలయ కుంభాభిషేకం

**శ్రీకాళహస్తి, ఆగస్టు 26 ప్రభాతవార్త:**



శ్రీకాళహస్తి నందిహిల్స్ వద్ద నూతనంగా నిర్మించిన హరిహరఅయ్యప్ప ఆలయ కుంభాభిషేకం కార్యక్రమాలు బుధవారం గణపతిపూజతో ప్రారంభమయ్యాయి. ఈ నెల 28న విగ్రహ ప్రతిష్ట కుంభాభిషేకం జరగనున్నాయి. ఉదయం నుంచి ఆలయ ఆవరణలో పండగ వాతావరణం చోటు చేసుకుంది. నూతన ఆలయం వద్ద నిత్యకళ్యాణం పచ్చతోరణంలా ముస్తాబు చేశారు. గణపతి కుంభాబిషేక కార్యక్రమాలకు శ్రీకారం చుట్టారు. పుణ్యావహచనం, పరిషత్తు, పచ్చద్రవ్య, రక్షాబంధన, దీక్షధారణ, గోపూజలతో ప్రవేశం నిర్వహించారు. తరువాత అఖండ దీపస్థాపన, మండపారధన నిర్వహించారు. లక్ష్మీగణపతి హోమం, నవగ్రహ హోమం, ఆవాహన దేవతల హోమం, జలాధివాసం, వీరాజన మంత్రపుష్పం కార్యక్రమాలను నిర్వహించారు. ఈనెల 28న కుంభాభిషేక కార్యక్రమాలు, విగ్రహ ప్రతిష్ట నిర్వహించనున్నట్లు నిర్వాహకులు తత్వమహి సేవా సంస్థ సభ్యులు తెలిపారు.

## ఆటో కార్మికుల సమస్యలు పరిష్కరించాలి : సీఐటీయూ

**పుత్తూరురూరల్, ఆగస్టు 26 ప్రభాతవార్త:**



రాష్ట్రంలోని లక్షలాది మంది ఆటోకార్మికుల జీవనం రోజు రోజుకు దుర్భరంగా మారుతున్నా రాష్ట్ర ప్రభుత్వం పట్టించుకోకపోవడం దారుణమని సీఐటీయూ పేర్కొంది. ఎన్నికల సమయంలో ఆటో కార్మికులకు ఇచ్చిన హామీలను అధికారంలోకి వచ్చిన తరువాత విస్మరిం చడం కార్మికులను మోసం చేయడమేనని విమర్శించింది. ఈ సందర్భంగా సీఐటీయూ ఆటో యూనియన్ జనరల్ బాడీ సమావేశం నిర్వహించారు. ఈ సమావేశానికి ఆటో యూనియన్ జిల్లా అధ్యక్షుడు లక్ష్మయ్య అధ్యక్షత వహించారు. ఈ సమావేశంలో సీఐటీయూ జిల్లా అధ్యక్షుడు జయచంద్ర, రాష్ట్ర కమిటీ సభ్యులు బాలసుబ్రహ్మణ్యం, సీఐటీయూ జిల్లా ఉపాధ్యక్షులు వెంకటేష్‌లు మాట్లాడుతూ పెట్రోలు, డీజిల్ ధరలు, వాహనాల స్పేర్‌పార్ట్స్ మరమ్మతు ఖర్చులు, ఇన్సూరెన్స్, ఫైనాన్స్ వాయిదాలు, రోడ్డు పన్నులు తదితర భారాలు పెరుగుతున్న నేపథ్యంలో ఆటో కార్మికుల ఆదాయం మాత్రం పెరగడం లేదు. రోజంతా కష్టపడి పనిచేసినా కుటుంబాన్ని పోషించుకోవడం కష్టంగా మారిందని, మరోవైపు చలానాలు, జరిమానాలు, పోలీసు, ఆర్టీవో అధికారుల వేధింపులతో ఆటో కార్మికులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని తెలిపారు. ఆటో కార్మికుల కోసం ప్రత్యేక సంక్షేమ బోర్డునఉ వెంటనే ఏర్పాటు చేయాలని, ఆటో కార్మికులకు పెన్షన్, ప్రమాద బీమా, ఆరోగ్య సదుపాయాలు, పిల్లల విద్య, వివాహ సహాయం తదితర సంక్షేమ పథకాలు అమలు చేయాలన్నారు. సమావేశంలో ఆటో యూనియన్ జిల్లా నాయకులు వాసు బాదుల్లా, బాషా, మనీ, విజయ్, మస్తాన్‌రెడ్డి, కుమార్, వెంకటరమణ, దీప తదితరులు పాల్గొన్నారు.

## సాధిక్ ఖాన్‌ను కఠినంగా శిక్షించాలి

**పుత్తూరురూరల్, ఆగస్టు 26 ప్రభాతవార్త:**




పుత్తూరులో భారతీయ జనతా పార్టీ ఆధ్వర్యంలో కాకినాడ లవ్ జీహాద్ ఘనటకు వ్యతిరేకంగా బీజేపీ జిల్లా కార్యదర్శి కోటకొండ బాబు ఆధ్వర్యంలో పుత్తూరు డివిజన్ డీఎస్పీ రవికుమార్‌కి వినతిపత్రం అందజేశ్శారు. ఈ కేసులో వంచన, మోసం, దోపిడీ, హత్య, లవ్ జిహాద్, ఉగ్ర కోణంపై సమగ్ర దర్యాప్తు జరిపి సాధిక్ ఖాన్ కఠిన శిక్ష పడేలా పోలీసులు చర్యలు తీసుకోవాలన్నారు. కార్యక్రమంలో బీజేపీ జిల్లా మండల నాయకులు శేఖర్, మోహన్, గోవిందరాజు, శివయ్య, కార్తీకేయన్, వెంకట్ రాజు, హిందు, పాల్గొన్నారు.

# తిరుపతి డివిజన్

## కంచనపల్లిలో ఇంటింటికి టీడీపీ

**తొట్టంబేడు, ఆగస్టు 26 ప్రభాతవార్త:**



టీడీపీ అధిష్టానం ఆదేశాల మేరకు తొట్టంబేడు మండల అధ్యక్షులు రావిళ్ల మునిరాజా నాయుడు ఆధ్వర్యంలో కంచనపల్లి పంచాయతీ ఎస్సీ హరిజనవాడలో డోర్ టు డోర్ కార్యక్రమం విజయవంతంగా నిర్వహించారు. మండల అధ్యక్షులు రావిళ్ల నేతృత్వంలో టీడీపీ నాయకులు హరిజనవాడలోని ప్రతి ఇంటికి వెళ్లి ప్రజలను నేరుగా కలిసి వారి సమస్యలను అడిగి తెలుసుకున్నారు. కూటమి ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాలు అర్హులైన ప్రతి ఒక్కరికీ అందుతున్నాయా లేదా అనే విషయాలపై ఆరా తీశారు. ఈ కార్యక్రమంలో బూత్ ఇన్‌చార్జ్ ఎస్. వెంకటేష్, క్లస్టర్ ఇన్‌చార్జ్ బి.మోహన్, యూనిట్ ఇన్‌చార్జ్ వై.బాలాజీ, సీనియర్ నాయకులు గాలి చలపతి నాయుడు, డి.రామనాయుడు, వాసునాయుడు, సి.గురవయ్య, చెంగయ్య, గణేష్, సి.వెంకటయ్య, చెంచుకృష్ణయ్య, చలపతి, రమేష్, రమణారెడ్డి, రామ్మూర్తి తదితరులు పాల్గొన్నారు.

## టీచర్ బాలుకు అరుదైన గౌరవం

**తొట్టంబేడు, ఆగస్టు 26 ప్రభాతవార్త :**



ఉపాధ్యాయ వృత్తిలోనే కాకుండా సాహిత్య రంగంలోనూ తనదైన ముద్ర వేస్తున్న దిగువ సాంబయ్యపాలెం ఫౌండేషన్ స్కూల్ ఉపాధ్యాయులు కయ్యూరు బాలసుబ్రహ్మణ్యంకు అరుదైన గౌరవం దక్కింది. ఈయన రచించిన గేయాలు ఈ విద్యా సంవత్సరం మహారాష్ట్ర రాష్ట్ర తెలుగు వాచకంలో పాఠ్యాంశాలుగా చేరడంతో విద్యా శాఖలో ప్రశంసలు వెల్లువెత్తుతున్నాయి. ఈ నెల 16వ తేదీన ఫిన్లాండ్ విద్యా విధానంపై జరిగిన రాష్ట్ర స్థాయి అధ్యయన కార్యక్రమంలో పాల్గొన్న పాఠశాల విద్యా కమిషనర్ తమీమ్ అన్సారియా, బాలు రాసిన గేయాలు ఉన్న మహారాష్ట్ర తెలుగు వాచక పుస్తకాలను స్వయంగా పరిశీలించారు. సరళమైన భాషలో, పిల్లలకు అర్థమయ్యే రీతిలో, నీతి, సంస్కృతి అంశాలతో కూడిన ఆ గేయాలు విద్యార్థుల్లో సృజనాత్మకతను పెంపొందిస్తాయని ఆమె కొనియాడారు. ఆయన సాధించిన ఈ విజయం యువ ఉపాధ్యాయులకు స్ఫూర్తిదాయకమని పలువురు పేర్కొంటున్నారు.

## స్వగ్రామ అభిమానుల కోలాహలం

**తొట్టంబేడు, ఆగస్టు 26 ప్రభాతవార్త:**



తొట్టంబేడు మండలం లింగమనాయుడు పల్లి గ్రామంలో ఎంజీఎం గ్రూప్స్ సంస్థల చైర్మన్ గుడ్లూరు మల్లికార్జున నాయుడు జన్మదిన వేడుకలు బుధవారం ఘనంగా నిర్వహించారు. స్వగ్రామానికి చెందిన మల్లికార్జున నాయుడు జన్మదినం సందర్భంగా గ్రామ యువత, గ్రామ ప్రజలు ఆధ్వర్యంలో ఆయనకు భారీ గజమాల, శాలువాలతో ఘన సత్కారం చేసి శుభాకాంక్షలు తెలిపారు. ఈ కార్యక్రమంలో మాజీ ఎంపీటీసీ కొప్పల రత్నశేఖర్, గ్రామ పెద్ద ఉన్నం చెంగమ నాయుడు, గంధం సురేష్, గంధం హరిప్రసాద్, రోసనూరు మనోజ్, కొప్పల సతీష్ కుమార్, కొప్పల మహేష్, గంధం అరవింద్, గంధం సుధీర్, గ్రామ యువత, గ్రామస్తులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

## రాష్ట్రస్థాయి అథ్లెటిక్స్ పోటీల్లో...
### ఉత్తమ ప్రతిభ కనబరిచిన నిత్య హాసిని




**తొట్టంబేడు, ఆగస్టు 26 ప్రభాతవార్త :**
అమరావతిలో జరిగిన ఛాంపియన్‌షిప్స్ 2026 రాష్ట్రస్థాయి అథ్లెటిక్స్ పోటీల్లో తిరుపతి జిల్లా శ్రీకాళహస్తికి చెందిన విద్యార్థిని పత్తి నిత్యహాసిని ప్రతిభ కనబరిచి రాష్ట్ర ఛాంపియన్‌గా నిలిచింది.వంశీ కళాశాల విద్యార్థిని అయిన నిత్యహాసిని అండర్17 బాలికల షాట్‌పుట్ విభాగంలో ప్రథమ స్థానం సాధించింది. శ్రీకాళహస్తిలోని నిత్య ఫిట్‌నెస్ సెంటర్ అధినేతలు జ్యోతిరావు, రూపాదేవిల కుమార్తె అయిన నిత్యహాసిని సాధించిన విజయం పట్ల శ్రీకాళహస్తి ప్రాంత వాసులు హర్షం వ్యక్తం చేస్తున్నారు. రాష్ట్రస్థాయిలో అద్భుత ప్రతిభ కనబరిచి తల్లిదండ్రులకు, కోచ్‌లకు గర్వకారణంగా నిలిచిన నిత్యహాసినికి క్రీడాభిమానులు, స్థానికులు అభినందనలు తెలిపారు.

## గుడి భూమి కబ్జా!
### -ఎమ్మెల్యే జోక్యంతో అక్రమ నిర్మాణానికి బ్రేక్









**శ్రీకాళహస్తి రూరల్ ఆగస్టు 26 ప్రభాతవార్త:**
శ్రీకాళహస్తి మండలం కాపుగున్నేరి పంచాయతీ పరిధిలోని ఇసుకగుంట గ్రామంలో దశాబ్దాలుగా గ్రామస్తులచే పూజలందుకుంటున్న ఆంజనేయస్వామి ఆలయ స్థలం ఆక్రమణకు గురైందన్న ఆరోపణలు కలకలం రేపుతున్నాయి. జాతీయ రహదారి విస్తరణలో భాగంగా ఆలయం తొలగించాల్సి రావడంతో హైవేశాఖ నుండి ఆలయ పునర్నిర్మాణం కోసం సుమారు 90 లక్షల రూపాయల పరిహారం అందినట్లు సమాచారం. అయితే గత ప్రభుత్వ హయాంలో అధికార పార్టీకి చెందిన ఓ బడా నాయకుడు ఆ నిధులను ఆలయ నిర్మాణానికి వినియోగించకుండా తన సొంత ప్రయోజనాలకు మళ్లించారని, ప్రస్తుతం వందల కోట్లు విలువచేసే ఆ స్థలంలో ఉన్న పురాతన విగ్రహాలను తొలగించి గుడిని నేలమట్టం చేసి చుట్టూ ప్రహరీ గోడ నిర్మిస్తున్నారని గ్రామస్తులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఈ అక్రమాన్ని గమనించిన గ్రామ పెద్దలు, భక్తులు వెంటనే స్థానిక శాసనసభ్యులు, జిల్లా కలెక్టర్, ఆర్డీవో శ్రీకాళహస్తి తహసీల్దార్ దృష్టికి తీసుకెళ్లి లిఖితపూర్వకంగా ఫిర్యాదు చేశారు. బాధితుల విజ్ఞప్తికి సానుకూలంగా స్పందించిన స్థానిక ఎమ్మెల్యే వెంటనే రెవెన్యూ యంత్రాంగాన్ని అప్రమత్తం చేశారు. ఎమ్మెల్యే ఆదేశాల మేరకు శ్రీకాళహస్తి ఎమ్మార్వో, వీఆర్వో, పంచాయతీ కార్యదర్శి, విలేజ్ సర్వేయర్లు సంఘటనా స్థలానికి చేరుకుని జరుగుతున్న అక్రమ కట్టడాన్ని అడ్డుకుని పనులను తక్షణమే నిలిపివేయించారు.దేవుడి భూమిని కాపాడి న్యాయం చేసిన ఎమ్మెల్యేకి,జిల్లా కలెక్టర్కి, ఎమ్మార్వోకు గ్రామస్తులు కృతజ్ఞతలు తెలిపారు.